ఫ్యామిలీ డాక్టర్

సుజనశ్రీ

డాక్టర్ నిరంజనరావు డిస్పెన్సరీ తలుపు తాళంవేసి 'సువేగా' స్కూటరు స్టార్ట్ చేశాడు.

ఇవాళ ఎందుకో అతడు చాల నిరుత్సాహంగా ఉన్నాడు. గత మూడునాలుగు రోజులనుంచి అతడి డిస్పెన్సరీకి ఒక్క పేషెంటన్నా రాలేదు.

స్కూటర్‌కి తాళంవేసి బార్‌లోకి నడిచాడు. ఒక మూలగా ఖాళీగావున్న టేబుల్ వెనుక్కుని అక్కడ కూలబడ్డాడు.

"బ్రాండీ! సోడా! చిప్స్!"

"యస్ సర్!" అంటూ అతివినయంగా సలాంచేసి వెళ్ళిపోయాడు వెయిటర్.

బాక్స్‌లోనుంచి పాశ్చాత్య సంగీతం నెమ్మదిగా స్ప్రెడవుతుంటోంది.

వెయిటర్ వినయాన్ని చూసిన నిరంజనరావు డబ్బులోనే ఉన్నది మహాత్మ్యం అంతా అనుకుని నిట్టూర్చాడు. ప్రపంచంలోని సర్వసుఖాలనూ తనచుట్టూ త్రిప్పగలిగే మంత్రదండం డబ్బు!

వెయిటర్ తెచ్చిన వాటిని మెల్లగా సేవిస్తూ మ్యూజిక్‌కి లయగా చేతివ్రేళ్లు ఆడిస్తూ సముద్రంలోని కెరటాల్లా ఆలోచనా కెరటాల్లో మునిగి తేలుతూన్నాడు. అతడి మనస్సు గతంలోకి ప్రయాణించింది.

నిరంజనరావుని అతని స్నేహితులు నిరంజన్‌రాయ్ లేదా డాక్టర్ రాయ్ అని మారుపేరుతో ముద్దుగా పిలిచేవారు మెడికల్ కాలేజీలో. అతని తండ్రి లాయరు. అతనికీ ప్రాక్టిస్ అంతంత మాత్రంగానే ఉండేది. సంపాదనకూ ఖర్చుకు బొటాబొటిగా సరిపోతుండేది.

తను ఎటూ తన స్వంతశక్తి మీద ధనవంతుడు కాలేకపోయాడు. కనీసం తన కొడుకన్నా సంపాదనపరుడై లక్షలు ఆర్జించాలన్న ఆశయంతో, ముందు చూపుతో అనేక కష్టాలకు ఓర్చి తనకొడుకుని యం. బి. బి. యస్. చదివించాడు నిరంజనరావు తండ్రి.

నిరంజనరావు తండ్రి, కొడుకు పెళ్ళిచేయకుండానే గతించాడు. ప్లీడరైన తండ్రీ, డాక్టరైన కొడుకూ ఇద్దరూ దరిద్రదేవతకరాళ హస్తాల్లోంచి బయటపడలేకపోయారు.

ప్రైవేటు ప్రాక్టీసులో లక్షలకు లక్షలు ఆర్జించవచ్చనే ఆశతో, ఆశయంతో అతడు ప్రభుత్వ నౌకరీని కాదని తిరస్కరించాడు. కాని, ప్రాక్టీసు అనుకున్న విధంగా సాగటంలేదు.

జీవితంలో అనుకున్నది సాధించలేక పోయాననే

విరక్తితో అతడు బ్రహ్మచారిగానే మిగిలిపోయాడు. తండ్రినుంచి సంక్రమించిన ఇల్లు వుంది. అందులోనే ముందుప్రక్క డిస్పెన్సరీ, వెనక పోర్షన్ తన నివాసానికి ఏర్పరచుకున్నాడు.

ఐదు రోజులక్రితం కాబోలు ఇద్దరు పేషెంట్లుమాత్రం వచ్చారు. ఆ తర్వాత మళ్ళీ ఎవరూ రాలేదు.

పోనీ ఎవరయినా అందమైన ఐశ్వర్యం కలిగిన విడో, భర్త్రువిహీన రెండో వివాహానికి మారు మనువుకి దొరికినా చేసుకుందామని పేపర్లలో మేట్రిమోనియల్ కాలమ్స్ వెదికి ప్రపోజల్స్ పంపాడు. కాని అతడి దురదృష్టమేమో అవీ కలిసిరాలేదు ఏ ఒక్కటీ.

ఆలోచనల్లోంచి తేరుకుని టైమ్ చూసుకున్నాడు.

రాత్రి పదయింది.

రెండో ఆట సినిమాకయినా పోదామని బేరర్ ట్రేలో బిల్లూ, టిప్ పడేసి నిర్లక్ష్యంగా లేచాడు.

బార్‌లోంచి బయటకు వస్తుండగా అతడికి ఒక జంట ఎదురుపడ్డారు. చూట్టానికి ఎంతో ముచ్చటైన జంటగా కనబడ్డారు. ఐశ్వర్యవంతుల్లాగ ఉన్నారు. ఆ వ్యక్తి ఎంత అదృష్టవంతుడో గదా అని మనసంతా అసూయ నింపుకుని స్కూటర్ తాళం తీశాడు.

వెనకనుంచి 'బాయ్' పరుగెత్తుకొచ్చాడు.

నిరంజనరావు కంగారుపడ్డాడు, తను బిల్లు సరిగా చెల్లించలేదా ఏమిటీ, లేకపోతే తనవెనుకే వాడెందుకు పరుగెత్తుకొస్తాడు అనుకున్నాడు.

"సార్! సార్! మిమ్మల్ని ఆ సార్ పిలుస్తున్నారు సార్?" అన్నాడు బేరర్.

"ఎవరు?" సందేహంగా అడిగాడు మళ్ళీ.

"అదేసార్! అమ్మగార్ని వెంటబెట్టుకుని ఇప్పుడే

లోపలకు వచ్చారుగదా! వారె సార్!"

తనను తానే నమ్మలేనట్టుగా అతడు స్కూటర్ లాక్ చేసి మళ్ళీ లోపలకు నడిచాడు. తనను రమ్మన్న వ్యక్తి తప్పకుండా పొరబడి ఉంటాడు. తన్ను చూసి ఎవరో తన ఫ్రెండని భ్రమపడి ఉంటాడు. పూర్ ఫెలో!

అయినా వెళ్ళి వచ్చినందువల్ల తప్పేంలేదు గదా! బైదిబై! అతని ప్రక్కనవున్న అందాలరాసిని మరోసారి చూడవచ్చుగదా అన్నఆశతో వాళ్ళుకూర్చున్న టేబుల్ దగ్గరకు వెళ్ళాడు.

2

"హల్లో మిస్టర్ రాయ్! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు? హౌ ఆర్ యూ?" అంటూ ఆ వ్యక్తి తనవంకే చూస్తూ అన్నాడు.

నిరంజనరావు ఉలిక్కిపడ్డాడు.

తనను రాయ్ అనిపిలిచే వారెవ్వరూ లేరు. తను స్టూడెంట్ గా ఉన్నప్పుడు తనకు మారుపేరు అది! అయితే ఇతగాడు కాలేజిమేట్ అయ్యుండాలి అనుకున్నాడు, అతడ్ని గుర్తుకు తెచ్చుకోటానికి ప్రయత్నిస్తూ.

"నన్ను గుర్తుపట్టలేదా? అవున్లే! మనం విడిపోయి పదేళ్ళకుపైగా అయివుంటుంది. నేను! రాఘవరావ్ ని!" అన్నాడు అతడు.

కుర్చీలాగి వాళ్ళమధ్యలో కూర్చున్నాడు. తన కెదురుగా అందాలరాసి కూర్చుని ఉంది. ఎడమచేతి ప్రక్కగా రాఘవ కూర్చుని ఉన్నాడు.

"ఓ! రాఘవా! నిన్ను గుర్తుపట్టలేకపోయాను సుమీ!" చివరకు అన్నాడు నిరంజనరావ్.

"సుజీ! మీట్ మై క్లాస్ మేట్! డాక్టర్ నిరంజన

రావ్? ఈమె నా ఫ్రెండ్! మిసెస్ సుజాతా కమలా కరం!'' అంటూ ఇద్దర్నీ పరిచయం చేశాడు రాఘవ.

నిరంజన్‌రావ్ వేపు తన చేయి చాపింది సుజాత.

''గ్లాడ్ టూ మీట్ యూ!'' అంటూ కరచాలనం చేసింది.

ఆమె చిరునవ్వు అతనిమీద వెన్నెలలు కురిపించినట్లయింది.

''అన్నట్టు లోగడ నీ వెక్కడో మేజిస్ట్రేట్ పని చేస్తున్నావని చెప్పాడే మీ నాన్న!''

''అది చాలాకాలం క్రితం మాటం డాక్టర్! మా తండ్రిగారు చాలాకాలం క్రిందటే గతించారు. అప్పుడే మేజిస్ట్రేట్ పదవికి రాజీనామా ఇచ్చేశాను. ఇప్పుడు ప్రైవేట్, ప్రాక్టీసు చేస్తున్నాను!''

''సివిలా క్రిమినలా?''

''మొదట్లో సివిల్ కేసులే చూస్తుండేవాణ్ని. రాను రాను క్రిమినల్ కేసుల్లోనే ఎక్కువ లాభించటం వల్ల ఇప్పుడు క్రిమినల్ లాయర్నే అని చెప్పుకోవాలి! సుజీ! వీడూ నేనూ చిన్నప్పుడు స్కూల్‌లో స్నేహితులమే కాదు! వాళ్ళనాన్న మా నాన్నగూడా మంచి స్నేహితులు!''

''ఐసీ!'' అంది సుజాత సిగరెట్ వెలిగిస్తూ.

''అన్నట్టు నీ ప్రాక్టీసు ఎలా వుంది! ఆ పాత ఇంట్లో నేనా ఉండటం! పెళ్ళి చేసుకున్నావా?''

''అదేమిటి? బయలుదేరబోతున్న రైలెక్కేవాడిలా అన్ని ప్రశ్నలూ ఒక్కేసారే వేస్తే ఎలా? వన్ బైవన్! మనం లీజర్లీగా మాట్లాడుకోవచ్చు! నేను వివాహం చేసుకోలేదు! ఐయామ్ స్టిల్ ఎ బాచిలర్!'' అన్నాడు నిరంజనరావు.

సుజాత సానుభూతిగా చూసింది. "ఆదేం?" అనడిగింది.

నీలాంటి అందమైన వనిత దొరకలేదు! అని సమాధానం చెబుదామనుకున్నాడు. కాని ఎక్కువ పరిచయం లేని వ్యక్తితో అలా మాట్లాడితే తన ఫ్రెండ్ కి కోపం రావచ్చని ఊరుకున్నాడు.

"ప్రాక్టీసు ఒక మాదిరిగా ఉంది. అదే ఇంట్లోనే ఉంటున్నాను. ముందువేపు డిస్పెన్సరీ, వెనుక పోర్షన్ రెసిడెన్స్!"

"దట్సాల్ రైట్ బోయ్! రేపే నిన్ను నీ డిస్పెన్సరీలో కలుస్తాను! ఫ్రెండ్లీ విజిట్ మాత్రమే! నీ పేషెంట్ గా మాత్రం కాదులే!" అని నవ్వాడు.

"యూ ఆర్ వెల్ కమ్! యూ టూ మేడమ్!" అంటూ అక్కడ్నుంచి లేచాడు నిరంజనరావు.

వాడి ప్రక్కన ఉన్న స్త్రీ ఎవరో ఆమె పూర్తి సమాచారం ఏమిటో రేపు వాడ్ని మరచిపోకుండా అడగాలి అనుకున్నాడు స్కూటర్ స్టార్ట్ చేస్తూ.

అసలు రాఘవ మొదటినుంచీ చురుకైనవాడు. ఆడపిల్లలతో స్నేహం అంటే వాడికి మంచి నీళ్ళప్రాయం. ఎటువంటి పొగరుబోతు స్త్రీతోనైనా ఇట్టే మాట కలిపేసేవాడు.

రాఘవ ఇప్పటికైనా పెళ్ళి చేసుకున్నాడో లేదో! ప్రపంచంలో మగాడికి సుఖాన్నివ్వగల వస్తువుల్లో స్త్రీ కూడా ఒకటి అని వాడి అభిప్రాయం. అంతేకాదు, బెల్లంచుట్టూ చీమలు మూగినట్టు డబ్బున్న వాడి చుట్టూ ఆడవాళ్ళు మూగుతారని అనేవాడు.

అటువంటి అభిప్రాయాలున్నవాడు పెళ్ళిచేసుకుని ఒక స్త్రీ చేతిలో కీలుబొమ్మగా మారతాడా? తనకు నమ్మకం లేదు.

3

మర్నాడు పది గంటలకు రాఘవరావు డిస్పెన్సరీకి వచ్చాడు కారులో.

వీడి ప్రాక్టీస్ వెలిగిపోతూ వుండాలి అనుకున్నాడు ఆ కారు చూడగానే.

“ఏమిటోయ్! హాస్పిటల్ అంతా బోసిపోతూ ఉంది!” అన్నాడు రాఘవ డిస్పెన్సరీని కలయచూస్తూ.

రాఘవ తత్వం మొదటినుంచీ అంతే. ముందు కొంచెం బాధ కలిగేలా మాట్లాడినా తర్వాత తనవల్ల అయిన సాయం చేస్తాడు.

“లేదు లేరా! నీ వొస్తున్నావని పేషెంట్లెవరినీ రావద్దన్నాను. అంతే! అది సరే! నీవు పెళ్ళి చేసుకున్నావా? పిల్లలెంతమంది?” ఆత్రంగా అడిగాడు.

“అపరా నీ నాయనమ్మ ప్రశ్నలూ నువ్వూను! స్కూల్లో ఎట్లా వుండేవాడివో అచ్చం అవే మాటలూ అవే ఆలోచనలూ! డిగ్రీ వచ్చిందేమోగాని నీవు మాత్రం వీసమెత్తు మారలేదుసుమీ! నేను పెళ్ళి చేసుకోలేదు. సరా?”

నిరంజనరావు తన పరిస్థితినీ వివరించాడు. తన ఆశయాలూ అన్నీ విపులంగా చెప్పాడు. తను జీవితంలో ఎలా అపజయాన్ని పొందాడో వివరించి చెప్పాడు.

“ఏమిటోరా! గడచిన జీవితమే హాయి అనిపిస్తూంది. నా పరిస్థితి ఇలానే ఇంకో రెండేళ్ళు ఉంటే ఏదో ఒక పాయిజన్ తిని చచ్చిపోవల్సిందేమో!”

“ఛా! ఏమిటిరా అంత నిరాశపడతావ్! జీవితంలో అందరికీ అవకాశాలు వెతుక్కుంటూ రావు. వాటికోసమే మనం వెతకాల్సి ఉంటుంది. ఆ అవకాశాల వెంట పరు

గత్తి అందుకోవాల్సి ఉంటుంది. నా ఉద్దేశ్యంలో నీకు అంతగా ప్రాక్టీసు రాకపోవడానికి కారణం! నీ డిస్పెన్సరీ చాల పాతకాలం నాటిదిలా ఉంది. దాన్ని మోడరన్ గా మార్చేయ్!''

''సరేలే! ఇంక మెతుపలేదు! మీసాలకు సంపెంగ నూనె! ఈ స్టెతస్కోప్ పాడయిపోయింది. అది కొత్తది కొందామంటేనే డబ్బులేదు!''

''మానుడు! డబ్బులేదు, డబ్బులేదు అని బీద అరుపులు అరవకు! కావాలంటే నీకు ఇరవయివేలు ఇస్తాను. అప్పుగానే అనుకో! డిస్పెన్సరీ రూపమే మార్చేయ్. నీ గీత మారిపోకపోతే నా తల తెగ్గోయ్యి!''

''ఏమిటీ? ఇరవయ్ వేలే! ఏదన్నా బ్యాంక్ కి డైరక్టరువా నువ్వు?'' ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి అడిగాడు నిరంజనరావు.

''అదంతా నీకెందుకు? ఇవాళ పదో తారీకు కదా? రేపు లేదు, ఎల్లుండి మా ఇంటికిరా! డబ్బు అరేంజ్ చేస్తాను! సరా? ఇదుగో నా అడ్రసు!'' అంటూ రాఘవరావు తన జేబులోంచి విజిటింగ్ కార్డు తీసి టేబుల్ మీద పెట్టాడు.

''అది కాదురా!''

''అది కాదు! ఇది కాదు! నీ అనుమానాలన్నీ అవతలకు నెట్టేయ్. ఆపదలో ఇరుక్కున్న వాళ్ళని తప్పించి డబ్బు సంపాదించటమే నా వృత్తి. నీ విషయంలో అది ఎగ్జెంప్షన్. నిన్ను ఆపదల్లోంచి కాపాడటానికి నీకే డబ్బు ఇస్తాను సరా!''

''ఒరే రాఘవా! నువ్వు మనిషివి కాదురా! దేవుడివి! పదేళ్ళనాడు విడిపోయిన మనం ఈ రకంగా కలుసు

దొరకటం నా అదృష్టం!'' అన్నాడు నిరంజనరావు ఆనందంతో.

4

సరిగ్గా పన్నెండింటికి డాక్టర్ నిరంజనరావు తన స్నేహితుడింటికెళ్ళాడు. రాఘవరావు ఆఫీసు ఎంతో నీట్‌గా ఉంది. పైగా అతగాడి రూమ్ ఏర్‌కండిషన్డ్ చెయ్యబడింది.

లాయరన్నవాడు ఆ మాత్రంగా ఉన్నాడంటే వాడి సంపాదన చెప్పుకోదగినంతగా ఉందన్నమాట.

"కమాన్ డాక్టర్! పంక్చువల్‌గా వచ్చావ్!'' అన్నాడు రాఘవరావు కుర్చీ చూపిస్తూ.

"డాక్టర్లంకదా! ఆ మాత్రం టైమ్ ప్రకారం నడవక పోతే పేషెంట్లు కొందరు టిక్కెట్టు పుచ్చుకోగలరు'' నవ్వుతూ అన్నాడు నిరంజనరావు.

"మనం ఇప్పుడే బ్యాంక్‌కి వెడదాం! వన్ మినిట్'' అంటూ తన గుమాస్తాని కేకేసి ఏదో చెప్పబోయాడు రాఘవరావు.

"ఒరేయ్! నీకు నన్ను చూస్తే నవ్వుతాలుగా ఉందా? పర్సనల్ ష్యూరిటీ మీద ఏ బ్యాంక్ లోన్ ఇస్తుంది? ఉన్న ఇల్లేమో తాకట్టు బాకీలో ఉన్న విషయం నీకూ తెలుసుగదా!''

"నా హామీ మీద ఇప్పిస్తాను సరా! అంతే కాదు! నీ బాకీ త్వరలో తీర్చుకునేందుకు వీలుగా నీకు నలుగు రైదుగురు మాంచి క్లయింట్స్‌ని గూడా అప్పజెబుతాను. ఆ దెబ్బతో నీవు చిన్న చిన్న పేషెంట్స్‌తో తిప్పలు పడక్కర్లేదు.''

నిరంజనరావు కళ్ళు కృతజ్ఞతతో మెరిసాయి!

5

రాఘవరావు చేసిన సహాయంతో తన డిస్పెన్సరీని మోడరన్ గా తీర్చిదిద్దాడు నిరంజనరావు. కొన్నికొన్ని చిల్లర బాకీలు తీర్చుకున్నాడు.

డబ్బు ఇప్పించటమే కాదు, అతను చెప్పినట్టుగా మాంఛి ధనవంతుడికి ఫ్యామిలీ డాక్టరుగా అయ్యే అవకాశం వచ్చింది.

అతడే కమలాకరం. కమలాకరం కోటీశ్వరుడు. స్వతహాగా వయసు చెల్లినవాడే అయినా పరువంలో ఉన్న అమ్మాయిని ముసలితనంలో పెళ్ళాడాడు. అతడికి ఎగుమతి, దిగుమతి వ్యాపారాలెన్నో ఉన్నయ్. ఆ మహానగరంలో ఓ పెద్ద హోటలుకి అతడు ఓనరు.

ఇవిగాక ఇంకా ఎన్నిరకాల వ్యాపారాలున్నయ్యో ఇతరులకు తెలీదు. అందరికీ తెలిసిందల్లా అతడికి నాలుగు కారులున్నయ్. పూర్తిగా ఎయిర్ కండిషన్డ్ చేయబడ్డ మూడంతస్తుల భవనం, అంతులేని ఐశ్వర్యం. అందమైన పడుచు పెళ్ళాం!

అతనో చిన్నసైజు కుబేరుడనవచ్చు.

అతగాడికి బ్లడ్ ప్రెషర్, గుండెపోటు ఇలాంటి ధనవంతులకు వచ్చే రోగాలున్నాయ్. అందుకని ప్రతిరోజూ అతన్ని పరీక్షించి ట్రీట్ మెంట్ ఇవ్వడానికి అతడికో ఫ్యామిలీ డాక్టరున్నాడు. అతడికీ బాగా వయసు ముదిరిపోయింది. అతడు విశ్రాంతికై రిటైర్ అవాలనుకోవటం వల్ల కమలాకరానికి మరో కొత్త డాక్టరు కావాల్సి వచ్చాడు.

రాఘవరావే నిరంజనరావుని పరిచయం చేశాడు.

"మాలాయర్ గారు మీగురించి ఎంతో ఇదిగా చెప్పారు.

అఫ్ కోర్స్! నేనూ మీ గురించి వాకబు చేశాననుకోండి!''
అన్నాడు కమలాకరం, నిరంజనరావుతో.

''పోనీ మీ రెవరయినా పార్టు స్పెషలిస్టుని ఎందుకు నియమించుకోకూడదు?'' అని అడిగాడు నిరంజనరావు అమాయకంగా.

'యూ ఫూల్! నిరిరా మోకాలొడ్డినట్లు నీకొచ్చిన అవకాశాన్ని మా రెవరికో కట్టబెడతానంటావేం?' అన్నట్టు రాఘవరావు అతనివంక కొరకొర చూశాడు.

''స్పెషలిస్టు అవునా, కాదా అన్నదికాదు ముఖ్యం. మా ప్రాణం కోట్లవిలువ చేస్తుంది. అనేకమంది నేను ఎప్పుడు చచ్చిపోతానా అని కనిపెట్టుకు కూర్చుని ఉంటారు. అందువల్ల నా జాగ్రత్తలో నే నుండాలి. నాకు వైద్యం చేసేవాడు నమ్మకమయిన వాడుగా ఉండాలి. మీ గురించి చెడుగా నేను ఏమీ వినలేదు. అందుకే మీకు ఈ ఆఫర్!''

''థాంక్స్'' చెప్పాడు నిరంజనరావు, మహదానందంతో.

ఆ రోజునుంచీ డాక్టర్ నిరంజనరావు, కమలాకరానికి ఫ్యామిలీ డాక్టరయ్యాడు.

''నీ కొత్త ఎప్పాయింట్ మెంట్ సందర్భాన్ని పురస్కరించుకుని రేపు సాయంత్రం హోటల్ సవేరాలో పార్టీ ఏర్పాటు చేస్తాను!'' అన్నాడు రాఘవరావు.

''ఎవరెవరు అతిథులు?''

''ఇంకెవరూ? మన నలుగురమే! నువ్వూ, నేనూ, మిస్టర్ కమలాకరం, మిసెస్ కమలాకరం!''

చివరిమాట విన్న తర్వాత నిరంజనరావులో ఉత్సాహం వచ్చింది.

6

ట్రిమ్‌గా డ్రెస్ చేసుకుని మర్నాడు టైమ్‌కి సరిగ్గా హాజరయ్యాడు నిరంజనరావు.

రాఘవరావు, సుజాత ఇద్దరే ఎదురయ్యారు అక్కడ.

టేబుల్ ముందు మూడో కుర్చీని ఇరతలికిలాగి సుజాతకు ఎదురుగా కూర్చున్నాడు నిరంజనరావు. బ్రాందీ ఇచ్చే మత్తుకన్న, సుజాత కళ్ళల్లోకి చూస్తుంటే ఇంకా ఎక్కువ నిషా వచ్చేట్టుంది.

రాఘవరావే ఆర్డరిచ్చాడు.

"కమలాకరంగారు రాలేదా?" అని అడిగాడు నిరంజనరావు. తీరా అడిగేశాక ఎంత చవటప్రశ్న వేశానా అని నాలుక కొరుక్కున్నాడు.

"ఆయనేదో అర్జెంటు బిజినెస్ మీద ఎక్కడికో వెళ్ళారు. ఆయన రాకపోవటం మీకేమన్నా డిసప్పాయింట్ అయిందా?" సుజాత అడిగింది.

"అబ్బే! లేదు! లేదు!"

"ఫర్ యువర్ హెల్త్!" అంటూ గ్లాసు సుజాత గ్లాసుని తాకించి నోటిదగ్గర పెట్టుకున్నాడు నిరంజనరావు.

"నా హెల్త్ బాగోలేకపోయినా ఫర్వాలేదు? అవున్లే! నీవు వాళ్ళ ఫ్యామిలీ డాక్టరువుగదా ఎంతైనా? ఏ గూటి చిలక ఆ గూటి పలుకులే పలుకుతుంది" రాఘవరావు అన్నాడు నవ్వుతూ.

సుజాత కిలకిల నవ్వింది.

గ్లాసు అంచులమీదుగా ఆమెవంకే చూస్తున్నాడు డాక్టర్.

కమలాకరం మనిషి ఎనుబోతులాగుంటాడు. అటువంటి వాడికి ఇంత అందమైన భార్య. బ్యూటీ అండ్ ది బీస్ట్

లాగ. నిజంగా కమలాకరం ఆడవాళ్ళని సెలెక్ట్ చెయ్యటంలో తన రసజ్ఞతను నిరూపించుకున్నాడు.

రాఘవరావు జోక్స్ వేస్తూ నవ్విస్తున్నాడు. సుజాత నవ్వుతోంది. ఆమె అందాన్ని కళ్ళతోనే త్రాగుతూ ఆ నిషాలో మధ్యమధ్యలో తనూ నవ్వుతున్నాడు రాఘవరావు జోక్స్‌కి.

జంటలు జంటలుగా ఫ్లోర్‌లోకి వెళ్ళి డాన్స్ చేస్తున్నారు మెంబర్లు. రాఘవరావు లేచి సుజాత వేపు చేయి జాపాడు. తన నాజూకైన చేతిని అతడికి అందించి తనూ లేచింది.

ఇద్దరూ ఫ్లోర్‌లోకి వెళ్ళారు. వాళ్ళిద్దరివంకే చూస్తూ గ్లాసులోని ద్రవాన్ని నెమ్మదిగా సిప్ చేస్తూ కూర్చున్నాడు. వాళ్ళిద్దరూ ఏవేవో సన్నగా మాట్లాడుకుంటున్నారు. మధ్యమధ్యలో నవ్వుతున్నారు.

రాఘవరావు వచ్చి మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు. సుజాతకూడావచ్చి తన కెదురుగా కూర్చుంటుందని అనుకున్నాడు నిరంజనరావు.

అయితే ఆమె కూర్చోలేదు. నిరంజనరావు దగ్గరకు వచ్చి తన చేతిని జాపింది.

అదృష్టదేవత తన్ను ఆహ్వానిస్తున్నట్లుగా భావించాడు. ఆ చేతిని అలాగే మృదువుగా పట్టుకుని లేచాడు. ఫ్లోర్‌లోకివెళ్ళి ఆమె నడుముచుట్టూ చేయివేసి స్టెప్స్ వేస్తుంటే అతడు పైపై లోకాల్లోకి వెళుతున్నట్టు ఫీలయాడు.

"రాఘవరావు చిన్నప్పట్నుంచే తెలుసా మీకు?" ఆమె అడిగింది.

"మే మిద్దరం క్లాస్ మెట్స్‌ము! చాల స్నేహంగా తిరిగే వాళ్ళం!"

"అలాగా?"

"మీలాంటి అందమైన వాళ్ళ స్నేహం సంపాదించటం అతడి అదృష్టం!"

ఆమె నవ్వింది. "అలా ఎందుకనుకోవాలి! మీరు మాత్రం స్నేహితులుకారా?"

"అఫ్‌కోర్స్ అవుననుకోండి!"

"అంతేకాదు. ఇంకో రహస్యం చెప్పనా?"

"చెప్పండి!"

"అటువంటి చొరవగల వాళ్ళంటే భర్తచాటున తిరిగే ఆడవాళ్ళు భయపడతారు. మీలాంటి బుద్ధావతారాలు అయితే అటువంటి భయం వుండదు."

తనను పరిహాసిస్తున్నదో, కాంప్లిమెంట్ చేస్తున్నదో అతడికి అర్థంకాలేదు. అసలు అతడి జీవితంలో స్త్రీలతో ఎలా మెలగాల్సింది అతడికి తెలీని సమస్య. ఆల్‌జీబ్రా కన్నా కష్టమైన ఈక్వేషన్.

"స్త్రీ మనసు మహాసముద్రంకన్న లోతైనదంటారు!" అన్నాడు.

"ఓ! మీకు కవిత్వంకూడా వచ్చే!"

మ్యూజిక్ ఆగిపోయింది. పాతజంటలు తిరిగిపోతుంటే కొత్తవాళ్లు మళ్ళీ మరో రౌండ్‌కి సిద్ధమవుతున్నారు.

సుజాత, నిరంజనరావులు వచ్చి కుర్చీలలో కూర్చున్నారు.

రాఘవరావు మరో మారు డ్రింక్స్‌కి ఆర్డరిచ్చాడు. వాచీవంక చూసుకొన్నాడు.

"సుజీ! నేను మళ్ళీ మీ ఇంటిదాకా రాలేను. డాక్టర్ నిన్ను మీ ఇంటిదాకా ఎస్కార్ట్ వస్తాడులే! నాకు రాత్రి గూడ నిద్రలేదు. రేపు కోర్టులో ఆర్గ్యుమెంట్ కేసొకటి ఉంది. ఇంటికి కెళ్ళి మాంఛి నిద్రతీస్తేతప్ప, రేపు కేసువ

ఎటెండ్ కాలేను!''

''నీ చెప్పేదూ ఇంతే!'' చిరుకోపంగా అంది సుజాత.

''ఏమంటారు డాక్టర్! ఆమెను ఇంటిదాకా దిగబెట్టి మీరింటికి వెళ్ళండి.''

''దాందేముంది. నీ వింతగా చెబితే నేను కాదని ఎలా అనగలను'' అంటూ ఆమెవంక చూశాడు ఆమె అంగీకారంకోసం.

ఆమె అలాగే చిఱునవ్వులు చిందిస్తోంది.

''సరే పదండి డాక్టర్!'' అని లేచింది సుజాత.

రాఘవరావు బిల్ పేచేసి లేచాడు. నిరంజనరావు స్కూటర్ని వేసుకుని వెళ్ళిపోయాడు.

కారులో డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. అతడి ప్రక్కనే సుజాత కూర్చుని ఉంది.

మలుపులు తిరుగుతూ కారు ముందుకు సాగిపోతోంది. సుజాత అతనికి దగ్గరగా జరిగింది. ఒకచేతిని అతడి భుజంపై వేసింది. తన తలను అతడి భుజంమీద ఆన్చింది. నిరంజనరావు కారుని ఆపేశాడు.

''అదేం? ఆపారు!'' అనడిగింది సుజాత మత్తుగా అతడి కళ్ళల్లోకి చూస్తూ.

ఆమె ముఖాన్ని రెండు చేతుల్తో తనవేపుకు త్రిప్పుకుని ఆమె పెదిమలమీద గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు నిరంజనరావు.

''యూ సిల్లీ బాయ్ ఇందుకా కారు ఆపింది?''

కారు మళ్ళీ స్టార్టయింది.

''మీ ఆయన ఊళ్ళో లేడా?''నిరంజనరావు అడిగాడు.

''లేకేం? ఈపాటికి నా కోసం ఎదురుచూస్తుంటారు!''

''చ్చ్!'' అని పెదవి విరిచాడు నిరంజనరావు.

ఆమె నవ్వింది. ''ఎందుకు అలా అడిగారు?''

"మీ వారు మళ్ళీ ఈ వారంలో ఎక్కడికి క్యాంప్ వెళ్ళరా?

"ఎల్లుండినుంచి ఆయన ఊరికెళ్తారు. మూడు రోజుల దాకా రారు!"

"నాకు ఒక రోజు పర్మిషన్ ఇప్పిస్తారా?"

"దేనికి?"

"మీతో తీరిగ్గా చాలా విషయాలు మాట్లాడాలి?"

ఆమె సీరియస్‌గా అయింది. "మీరేదో పెద్దమనుష్యులు గదా అని గౌరవం యిస్తుంటే మీరు మితిమీరి పోతున్నారు. ఇందాక బలవంతాన ముద్దుపెట్టుకున్నారు. ఇప్పుడేమో ఇంకా హద్దుమీరి మాట్లాడుతున్నారు."

"సారీ మేడమ్! మీ అందం నన్ను నిషాలో ముంచేసింది. నేను అతిగా ప్రవర్తించానేమో! ఎక్స్యూజ్ మీ!" అన్నాడు నిరంజనరావు షాక్ తిన్నవాడిలా. రోడ్డుమీదకే చూస్తూ సీరియస్‌గా డ్రైవ్ చేయసాగాడు.

అంతలోనే మళ్ళీ సుజాత నవ్వు వినిపించింది.

"నిజంగానే తీసుకున్నారా నా మాటలు! మీరెంత ధైర్యవంతులో కనిపెడదాం అని అలా సీరియస్‌గా అన్నాను. అంతే! ఎంతైనా మీరు ఫ్యామిలీ డాక్టరు. నన్ను సంపూర్ణంగా పరీక్షించే అధికారం మీకు ఉంది! సరేనా? సోమవారంనాడు నేను ఫ్రీ! వుయ్ కెన్ హావ్ ఫన్!" అంది ఆమె.

కారు గేటు దాటి బంగళాముందు ఆగింది.

"కారు తీసుకు వెళ్ళండి. రేపుదయం డ్రైవర్ని పంపి తెప్పించుకుంటాను!" అంది సుజాత.

"థాంక్యూ వెరీమచ్!"

"సుజాత నిరంజనరావు మొహంలోకి ఓ క్షణం పరీక్షగా చూసింది. "నీ అమాయకత్వం చూస్తే నాకు

నిజంగా జారిస్తుంది. నీవు చాలా కష్టాల్లో పడబోతున్నావ్. జాగ్రత్తగా వుండు'' అంటూ సుజాత గబ గబ లోపలకు వెళ్ళిపోయింది.

కారు డ్రైవ్ చేసుకుంటూ డాక్టర్ నిరంజనరావు ఇంటి దోవపట్టాడు. సుజాత మాటలు అతడికి అర్థం కాలేదు. తను ఇప్పుడు హాపీగా వున్నాడు. చేతినిండా డబ్బు వుంది. ప్రాక్టీసుకూడా మెరుగైంది. మరి తనకు కష్టాలేమిటి? సుజాత ఏదో తమాషాకు అలా అని వుంటుందని సరిపెట్టుకున్నాడు. అయినా, మళ్ళీసారి సుజాతను కలుసుకున్నప్పుడు ఆ విషయం అడగాలని తీర్మానించుకున్నాడు.

ఇంటి ముందు ఖాళీ జాగాలో కారు పార్క్ చేసి ఇంటి తలుపు తాళం తీసి, లైటు వెలిగించాడు. కోటు విప్పి బెడ్ మీదకు విసిరేశాడు. బూటులేసులు విప్పుకుని తలపైకెత్తాడు.

అంతే! నోరు తెరుచుకుని ఆశ్చర్యంతో నిలబడిపోయాడు.

ఎదురుగా పాతికేళ్ళ యువతి కుర్చీలో కూర్చుని వుంది నిద్రపోతున్నట్టుగా.

''ఏయ్ మాడమ్! ఎవరు నువ్వు!'' అని అరిచాడు.

ఆమె పలకలేదు. అతడు దగ్గరకు వెళ్ళి ఆమెని కదిలించి లేపుదామని ఆమె మీద చెయ్యి వేశాడు. ఆమె ఒళ్ళు చల్లగా ఐస్‌లా ఉంది.

ఆమె చనిపోయి ఉంది. అతడికి ఒళ్ళంతా చెమటలు పోశాయి. సుజాత చెప్పిన అపాయం ఇదేనా?

7

పోలీస్ జీప్ వచ్చి ఇంటిముందు ఆగింది. నిరంజనరావు గేటులోనే ఇన్‌స్పెక్టర్ని రిసీవ్ చేసుకున్నాడు.

"ఈమెను మీరు ఇదివరలో ఎన్నడయినా చూశారా?"

"లేదండీ! ఎన్నడూ చూసి ఎరగను!"

"పోనీ ఆమె ఎవరో ఏమిటో ఆచూకీ తెలుసా?"

"లేదు సార్!"

"అయితే ఈమె మీ పేషెంట్ కాదన్నమాట!"

"ముమ్మాటికీ కాదు."

"మీ కన్సల్టేషన్ కోసం కొత్తగా వచ్చిన పేషెంటేమో!"

"అయితే అయివుండచ్చు. కాని ఆమెతో ఇదివరలో నాకెలాంటి పరిచయం లేదని ధృఢిగా చెప్పగలను."

"ఆమెకు మీ ఇంట్లో ఏం పని?"

"ఆమె మీకు ఎంతవరకు తెలుసో, నాకూ అంతవరకే తెలుసు సార్!"

"మీరు చెప్పేది నిజమయితే ఇదంతా అయోమయంగా తయారవబోతోంది. ఒక అపరిచిత వ్యక్తి మీ ఇంట్లో చనిపోయి ఉండడం ఎన్నో అనుమానాలకు దారితీస్తుంది. మీరు బయటకు వెళ్ళేటప్పుడు ఇంటికి తాళం వేసుకుని వెళ్ళారు కదూ?"

"అవునండీ తాళం వేసే వెళ్ళాను!"

"ఈ తాళం డూప్లికేట్ కీ ఎవరి దగ్గరన్నా ఉందా? అంటే మీరెవరికన్నా ఇచ్చారా?"

"లేదండి! దాని తాలూకు డూప్లికేట్ నా డ్రాయర్లో భద్రంగా ఉంది."

"చాలా ఆశ్చర్యంగా ఉందే! ఆమె చనిపోయి ఎంతసేపయివుంటుందని మీ అభిప్రాయం! అహాఁ! మీరు గూడ డాక్టరే కదా అని?"

"ఆమె చనిపోయి మూడు నాలుగు గంటలై ఉండాలి."

"రాత్రి మీరు ఎన్నింటికి ఇల్లు వదలి బయటకు

వెళ్ళారు?"

"రాత్రి ఏడుగంటలకే వెళ్ళిపోయాను. స్టెర్లింగ్ స్ట్రీట్‌లో ఒక పేషెంట్‌ని విజిట్ చేశాను. ఆ తర్వాత హోటల్ సవేరాకు వెళ్ళాను, నా ఫ్రెండ్ ఒకతను పార్టీ ఇస్తే! నేను తిరిగి వచ్చేసరికి తెల్లవారుజామున నాలుగయింది!"

"అంటే మీరు లేనప్పుడు ఎవరో ఈమెని ఇక్కడకు తెచ్చి పడేసి ఉండాలి!"

"అవచ్చు!"

"మీకు పార్టీ ఇచ్చిన ఫ్రెండ్స్ పేరు చెప్పండి!"

"వాళ్ళని అనవసరంగా ఇందులోకి లాగటం ఎందుకు సార్?"

"వాళ్ళని ఇరికించేదేముంది డాక్టర్? మీరు వాళ్ళతో రాత్రంతా గడిపినట్టు సాక్ష్యం ఉంటే మీరే ఈ కేసు లోంచి బయట పడతారు."

నిరంజనరావు చెప్పాడు రాఘవరావు పేరూ, సుజాత పేరూ, వాళ్ళ అడ్రసులూ.

"మీరు ఈమెను చూసిన తర్వాత ఎంత సేపటికి మాకు ఫోన్ చేశారు?"

"ఎంతో సేపా? సెకండ్స్‌లోనే!"

"చూడండి డాక్టర్! మీరు అబార్షన్ కేసులు చూస్తుంటారా?"

అంత సీరియస్‌గా ఉన్నా నిరంజనరావు అతడి ప్రశ్నకు నవ్వాడు.

"ఏం? నా ప్రశ్న మీకు నవ్వు తెప్పిస్తున్నదా?"

"అవును! కానీ నేను అబార్షన్ కేసులు ఎప్పుడూ టేకప్ చేయలేదు! ఒకవేళ ఎవరన్నా వచ్చి ఉన్నా వాళ్ళని ఏ లేడీ డాక్టరు దగ్గరకో పంపించే వాడ్ని."

మరో సార్జంట్ ఇల్లూ, డిస్పెన్సరీ వెదికి వచ్చాడు.

"ఏమీ దొరకలేదు సార్!"

"ఆమె ఒంటిమీద ఎలాంటి గాయాలు లేవు. ఆమె చావుకు కారణం ఏమయి వుంటుంది?"

"అది మీ మెడికల్ ఎక్స్‌పర్ట్ చెప్పవలసిన విషయం?"

"అఫ్‌కోర్స్! పోస్టుమార్టమ్ రిపోర్టుకోసం ఆగాలను కోండి! పోతే మీరొకసారి స్టేషనుకు వచ్చి స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది."

శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపి వ్రేలిముద్రలు ఎక్కడన్నా దొరుకుతాయేమో అని చూశారు. కాని ఎక్కడా ఏమీ దొరకలేదు, నిరంజనరావు వ్రేలిముద్రలు తప్ప.

"నే కాస్త బయటికి వెళ్ళొస్తాను. ఈ అయిదు నిముషాల్లో మీరు బాగా ఆలోచించండి."

"ఏమాలోచించను?"

"అదే! మీరు నిజమే చెబుతుంటే! ఎవరో దొంగ రాస్కెల్ మీ మీద పగ తీర్చుకోటానికో లేక, మీ గుడ్ నేమ్ పాడు చెయ్యటానికో ఇది చేసి ఉంటాడు. వాళ్ళెవరో అంతుపడతారేమో ఆలోచించండి."

ఇన్‌స్పెక్టర్ బయటికి వెళ్ళాడు.

కుర్చీలో కూర్చుని టేబుల్ మీద మోచేతులు ఆన్చి రెండు చేతుల్లో తలపెట్టుకున్నాడు డాక్టర్ నిరంజన రావు.

అతడి మనసు ఆలోచనల్లోకి జారుకుంది.

సరిగ్గా నిన్న సాయంత్రం కమలాకరం అర్ధరాత్రి పూట వచ్చి లేపాడు తనను. అతని వెంట ఎవరో స్త్రీ ఉంది. మరో యువకుడు రౌడీలాంటివాడు ఉన్నాడు.

ఇద్దరిలో ఎవరూ పెదవి తెరిచి మాట్లాడలేదు. ఆ

స్త్రీకి భుజంలో బుల్లెట్ దిగింది. మైనర్ ఆపరేషన్ చేసి దాన్ని తీశాడు. డ్రెస్ చేసి, ఇంజెక్షన్ ఇచ్చాడు. అతను చేసేదంతా కమలాకరం పరీక్షగా చూస్తూ కూర్చున్నాడు.

"చాలా త్వరగానూ, నీట్ గానూ చేశారు డాక్టర్!" అన్నాడు చివరకు.

"కాని ఈమెకు ఈ గాయం ఎలా తగిలిందో చెప్పనే లేదు మీరు?"

"చూడు డాక్టర్! మనం ఇప్పుడు చాలా క్లోస్ ఫ్రెండ్స్మి! అవునా?"

"కాదని ఎవరన్నారు? కాని చట్టం ఏమంటుందో తెలుసా? ఎవరికైనా బుల్లెట్ గాయాన్నికాని, తుపాకీ గాయాన్నిగాని ట్రీట్ చేసినప్పుడు పోలీసులకు తెలియ బరచటం డాక్టర్ల విధి! లేదా మా రిజిస్ట్రేషన్ ఊడి పోతుంది."

"లా నాకూ తెలుసు! కాని ఈ కేసులో మీకు ఎటువంటి ట్రబుల్ ఉండదు! సరేనా? మీరసలు ఈ బుల్లెట్ కేసుని ట్రీట్ మెంట్ చేసిన విషయమే మరచి పొండి. దానికితగ్గ ప్రతిఫలం ఉంటుంది గూడ!" అంటూ కమలాకరం నోట్లకట్ట నొకదాన్ని బల్లమీద పెట్టాడు.

వాటివంక చూశాడు నిరంజనరావు. వెయ్యి రూపా యలు అవి. అయినా అతడు వాటిని తీసుకోలేదు. "ఈమె విషయం మీరు చెప్పక తప్పదు!"

"ప్చ్! అసలు విషయం నీకు ముందేచెప్పి ఉండా ల్సింది" అని స్వగతంలా అనుకున్నాడు కమలాకరం. "నాకు రెండుమూడు పెద్ద నగరాల్లో 'పోష్' హోటల్ను న్నాయి. అవంతా బ్లాక్ మనీతో రన్ అవుతూన్నవే! వాటిలో కేబరే డాన్సులుగూడ ఉంటయ్. ఈ సంఘటన

అలాంటి చోటే జరిగింది.

"అప్పుడప్పుడు మస్తుగా తాగేసిన ప్రేక్షకుడు కలభా చెయ్యటం మామూలే. అందుకు మా మనుషులు రెడీగా ఉంటారు. కాని ఒక్కోసారి రెచ్చిపోయిన ఆ వ్యక్తి రివాల్వరు తీయటంగూడ చేస్తుంటాడు. అలా కలభా అయినట్లు పోలీసులకు తెలిస్తే హోటలు లైసెన్సు రద్దవుతుంది. ఇదివరకటి డాక్టర్ ఇలాంటి కేసుల్ని ఎన్నిటినో రెండో కంటికి తెలియకుండా పూర్తిచేశాడు. అతడెన్నడూ రిస్క్‌కి గురికాలేదు. నీవూ అలానే చేయాలి!"

"అలా వీల్లేదు."

"సరే! బాగా ఆలోచించుకో డాక్టర్! ఆ తర్వాత నీ ఖర్మ!" అంటూ కమలాకరం విసురుగాలేచి బయటకు వెళ్ళిపోయాడు.

టేబుల్ మీద నోట్లకట్ట అలానే మిగిలిపోయింది. దాన్ని తీసి డ్రాయర్లో పడేశాడు విసుగ్గా.

అయితే మర్నాడు నిరంజనరావు పోలీసులకు ఫోన్ చెయ్యలేదు. బ్యాంక్‌కి వెళ్ళి ఆ డబ్బుని డిపాజిట్‌లో వేసి వచ్చాడు.

8

అయితే! ఈ గుర్తుతెలియని శవం కమలాకరం చేసిన గారడీయా? ఆమె అతగాడి నైట్‌క్లబ్స్‌లో మనిషి అయి ఉండాలి. ఆమెకూ వాళ్ళకూ ఏదో పేచీవచ్చి వుంటుంది. ఆమెను తెలివిగా విషంయిచ్చి చంపి ఉంటారు. తను లేనప్పుడు తెచ్చి తన ఇంట్లో పడేసిపోయారు.

లేదా? సుజాతతో పరిచయాన్ని సహించలేని రాఘవరావు పనా ఇది? తనకు ఆపద ఎటునుంచి రాబోతుంది? ఏది ఏమైనా తను చేతులారా ధన వ్యామోహంతో సాలెగూటిలో ఇరుక్కున్నట్లనిపించింది మొదటిసారిగా

అతనికి.

ఇన్స్పెక్టర్ రాకతో అతడి ఆలోచనలకు అంతరాయం కలిగింది.

"ఏమన్నా గుర్తుకు వచ్చినవా?"

"లేదు!" నింపాదిగా అన్నాడు నిరంజనరావు.

"మీ ఆఫీసులో ఎటువంటి అనుమానాస్పదమైన ఆధారాలు కనిపించలేదు. ఆమె పర్సులో ఆమె చిరునామా ఉన్న కార్డు దొరికింది. ఆమె పేరు కె. రాజ్యలక్ష్మి అని ఉంది. ఆ పేరుగల వ్యక్తులు ఎవరన్నా మీ పేషెంట్లు ఉన్నారా?"

"ఒకరిద్దరు ఉండొచ్చు!"

"మీరు ఎకౌంట్స్ మెయిన్ టెయిన్ చేస్తారా?"

"డామ్ కరెక్టుగా!"

"అయితే వాటిని వెరిఫై చెయ్యాలి!"

టెలిఫోన్ మ్రోగింది. ఇన్స్పెక్టర్ రిసీవ్ చేసుకున్నాడు. క్రేడిల్ మీద రిసీవర్ని పెట్టేస్తూ అన్నాడు. "ఆమె ఎల్. ఎస్. డి. డోస్ ఎక్కువగా సేవించటం వల్ల చనిపోయిందట. అంతేకాదు, ఆమె అలాంటి ద్రవ్యాల్ని రెగ్యులర్ గా తీసుకునే వ్యక్తి అయివుండొచ్చని మా డాక్టర్ అభిప్రాయంట. సరే! మీ ఫార్మల్ స్టేట్ మెంట్ ఇవ్వండి."

స్టేట్ మెంట్ రాసి సంతకంచేసి, ఇన్స్పెక్టర్ చేతి కిచ్చాడు నిరంజనరావు.

అతని ఎకౌంట్ పుస్తకాలు తిరగేశారు పోలీసులు.

రాజ్యలక్ష్మి అనే పేరుగల వాళ్ళు ముగ్గురున్నారు అతడి పుస్తకాల్లో. వాళ్ళ అడ్రసులు తీసుకుని కాని స్టేబుల్స్ వెళ్ళిపోయారు.

ఇన్స్పెక్టర్ నిరంజనరావుతో మాట్లాడుతూ ఉండ

గానే వాళ్లు తిరిగి వచ్చారు.

"మేం వెరిఫై చెయ్యటానికి వెళ్ళిన ముగ్గురు వ్యక్తులూ అదే రాజ్యలక్ష్మి అనే పేరుగల ఆ ముగ్గురూ బ్రతికే ఉన్నారుసార్! తర్వాత లాయర్ రాఘవరావుగార్ని కూడ కనుక్కొని వచ్చాం. డాక్టర్ గారు నిన్న రాత్రంతా వారితోనే ఉన్నట్లు చెబుతున్నారు."

"వట్నాల్ రైట్! ఈ హత్యతో మీకేం సంబంధం లేదని ఇంతవరకూ దొరికిన సాక్ష్యాలు ఋజువు చేసినయ్. ఇక ఆ చనిపోయిన వ్యక్తి ఎవరు, ఎందుకు చనిపోయింది, ఇక్కడకు ఎలావచ్చి చేరింది, అనేవి మేము సాల్వ్ చెయ్యాల్సినవి. మీకు ఏదైనా సమాచారం దొరికితే మాకు వెంటనే తెలియజేయటం మర్చిపోవద్దు!" అంటూ ఇన్స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

తను హాఠాత్తుగా ఇరుక్కుపోయిన ఈ సంఘటనలో ప్రాణ్పడిపోయాడు నిరంజనరావు.

9

కారు డోర్ తెరుచుకుని వయ్యారాలు ఒలకబోస్తూ సుజాత వచ్చింది.

"హాలో! గుడ్ మార్నింగ్ మేడమ్! ఏమిటిలా వచ్చారు?"

"మా వారు ఇవాళ ఊరికి వెళుతున్నారు. రాఘవరావు కేసు ఏదో సెషన్స్‌కి వచ్చింది ఇవాళల్లా రాలేనని కబురు చేశాడు. అన్నట్టు ఇవాళేగా మిమ్మల్ని రమ్మన్నాను!" అంది సుజాత కుర్చీలో కూర్చుంటూ.

"ష్యూర్! ష్యూర్! ఎ ప్లెజంట్ ఈవెనింగ్ ఎహేడ్!"

"మీరు పేషెంట్ల గొడవలో నన్ను మర్చిపోతారేమో

చెప్పిపోదామని వచ్చాను. వెళ్ళిరానా? మావారి ప్రయాణానికి ఏర్పాట్లు చూడాలి! టా! టా!'' అంటూ వెళ్ళిపోయింది సుజాత.

నిరంజనరావు తన డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళి గబగబా మరో తడవ షేవ్ చేసుకుని స్నానం చేసి భోజనం పూర్తిచేశాడు. నాలుగు గంటలకు అలారం పెట్టుకుని బెడ్ మీద వాలిపోయాడు.

సాయంత్రం స్కూటర్లో మెజిస్టిక్ హోటల్‌కి పోతూండగానే దోవలో రాఘవరావు కలిశాడు.

కూల్ డ్రింక్స్ సిప్ చేస్తూ అడిగాడు నిరంజన్ రావు.

“కమలాకరంతో నీకు పరిచయం అయి ఎంతకాలం అయి ఉంటుంది?''

“చాలాకాలం అయింది! ఎందుకు?

“సుజాతతో!''

“సుమారు మూడేళ్ళ క్రితంనుంచి. ఆమె ఒక పోష్ హోటల్లో కేబరే డాన్సరుగా ఉండేది.''

“ఆమెకూ నీకూ రహస్య సంబంధం ఉందా?''

“ఓరి ఇడియట్! ఇదా నీ అనుమానం! ఆమె భర్త ముసలివాడు. అందుకే ఆమెకు కొంత ఫ్రీడమ్ ఇచ్చాడు. అయినా ఎన్నడూ మేం అతనికి పట్టుబడలేదు. ఎందుకైనా మంచిది. నువ్వు జాగ్రత్తగా మసలుకో. ఆమె అందాన్ని త్రాగేసేలా చూస్తూంటావ్. కమలాకరం కళ్ళబడితే తెలుసుగా అతగాడి సంగతి!''

“నీకూ కమలాకరానికి ఎలా పరిచయం? అతదేదన్నా క్రిమినల్ కేసులో ఇరుక్కుని నీ దగ్గరకు క్లయింట్‌గా వచ్చాడా?''

“నీ తెలివి మండిపట్టే ఉంది! నేను క్రిమినల్ లాయర్నయినంత మాత్రాన నా క్లయింట్సంతా నేరస్థులే

నంటావా?'' రాఘవరావు సిగరెట్ వెలిగించాడు.

"ఒకసారి అతనికి తెలిసిన వ్యక్తిని అరెస్టుచేశారు పోలీసులు ఏదో కేసులో. అతను ఒకరిద్దరు లాయర్లను సంప్రదించాడు అతని విడుదలకోసం. వాళ్లు లాభంలేదని పెదవి విరిచారు. ఆకేసు నేను చేపట్టి అతడ్ని విడుదల చేయించాను. అప్పట్నుంచి అతడి లాయర్నయిపోయాను. సంవత్సరానికి ఇంత అని ముట్టచెబుతాడు ఫీజు క్రింద! అయినయ్యా నీ అనుమానాలు? ఇంకా ఏమన్నా ప్రశ్నలున్నాయా?''

నిరంజనరావు తనకు అంతగా సహాయం చేసిన మిత్రుడ్ని అనుమానించినందుకు నొచ్చుకున్నాడు.

"సారీ మిస్టర్ రాఘవా!'' అన్నాడు.

"మనలో మనకి సారీ ఏమిటిరా?''

రాఘవరావు వెళ్ళిపోయాక నిరంజనరావు సిగరెట్ వెలిగించి, స్కూటర్ స్టార్ట్ చేసి బయలుదేరాడు.

10

"డార్లింగ్! నిన్ను ఎన్నో ప్రశ్నలు అడగాలని వుంది'' సుజాతను తన కౌగిలిలో బిగిస్తూ అన్నాడు నిరంజనరావు.

ఆమె మత్తుగా అతనివేపు చూసింది "ఊఁ! అడుగు'' అంది.

"ఆ రోజు నీవు అన్నావ్ గుర్తుందా? నీవు చాలా కష్టాల్లో వున్నావ్! అని. దానర్థం ఏమిటి?''

"ఓ, అదా! దానికి చాలా హిస్టరీ వుంది! ఏదీ ఇంకో గ్లాసు నింపు!'' అంటూ ఖాళీగ్లాసుని చూపించింది.

నిరంజనరావు బీర్ బాటిల్ అందుకుని ఆమెకు మరో గ్లాసు నింపాడు. ఆమె గ్లాసు ఖాళీ చేసి స్టూల్ మీద పెట్టింది.

"డార్లింగ్! సిగరెట్!" అంది గోముగా.

విధేయతగల నౌకరులా నిరంజనరావు లేచి స్టాండ్ దగ్గరకు నడిచాడు. ఇద్దరికీ ఒంటిమీద బట్టలేవు. వారి బట్టలు ఆ స్టాండుమీద చోటు చేసుకున్నాయి.

తన ప్యాంటు జేబులోంచి 'ఫిల్టర్ కింగ్' సిగరెట్లు ప్యాకెట్ తీశాడు. ఓ సిగరెట్ తన పెదాల మధ్య పెట్టుకుని లైటర్ వెలిగించాడు. ఆ తర్వాత దాన్ని తీసి సుజాత పెదాలమధ్య పెట్టేశాడు.

"యూ సిల్లీ బోయ్!" అంటూ ఆమె గబగబ నాలుగు దమ్ములు లాగి తన నోట్లోంచి తీసి దాన్ని మళ్ళీ నిరంజనరావు నోటికందించింది.

"నిజం చెప్పాలంటే నీకే కాదు! నేనూ కష్టాల్లో ఉన్నాను."

"ఈ వేదాంతం కట్టిపెట్టి అసలు పాయింటుకురా డార్లింగ్!"

"నేను కాలేజీలో బి. ఏ. చదువుతూండగా మా నాన్న చనిపోయాడు. మాకు ఉన్న ఆస్తల్లా ఒకే ఒక ఇల్లు. నేను చాలా కష్టాలకోర్చి చదువు పూర్తయిందని పించాను. డిగ్రీ చేతికొచ్చేటప్పటికే నేను టైప్ రైటింగ్, షార్ట్ హాండ్ పరీక్షలు ప్యాసయి ఉన్నాను. నాకున్న చదువుతో స్టెనోగా చేరి నన్నూ నా తల్లినీ పోషించుకోవాలనుకున్నాను. కాని ఎక్కడికి వెళ్ళినా నా అందాన్ని చూసి నా జీవితాన్ని కాటువేయాలని చూసే వాళ్ళేగాని నా పొట్ట నేను పోషించుకోనివ్వలేదు మీ మగవాళ్ళు."

"ఎక్కడైనా జరిగే కథే ఇది! ఆ తర్వాత?"

"నేను చిన్నప్పట్నుంచీ దారిద్ర్యంలో పుట్టి పెరిగాను. అందుకని సహజంగా నా కోరికలు ఐశ్వర్యం

గురించి భోగభాగ్యాల మీద నే ఉండేది. నా కలలన్నీ లక్షాధికారి అయిన భర్తమీద బంగళా, కారు వీటి చుట్టూ నే పరిభ్రమించేవి.

"అనేక ప్రైవేటు కంపెనీలలో స్టెనోగా పని చేస్తూ నే నా క్కావలసిన భర్తకోసం గాలం వేస్తూ వచ్చాను. అయితే అప్పటివరకూ ఏ మగవాడికీ లొంగలేదు. మగవాడికి ఒళ్ళప్పగించిన ఆడది దీపంలోకి ఉరికిన పురుగులాగ నాశనమవుతుందని నాకు తెలుసు.

"ఆ తరువాత కొన్నాళ్ళకు మా తల్లి చనిపోయింది.

"అప్పులు తీర్చడం కోసం ఇల్లు అమ్మివేశాను. ఆ తర్వాత మహిళా సంఘం సెక్రటరీ ఒకామె క్లబ్ లో రిసెప్షనిస్టుగా ఉండమని కోరింది. అక్కడే నేను డాన్సర్ గా, కాబరే డాన్సరుగా మారిపోయాను. ఎందుకు? నా ఖర్చులకు సరిపోను ఆదాయం రావటానికి!

"వారానికి నాలుగువందల రూపాయలు వచ్చేవి. మద్రాసు, హైదరాబాదు, మైసూరు, బెంగుళూరు, బొంబే అన్ని చోట్ల డాన్సు చేశాను. కార్లలో షికార్లు, బ్రహ్మాండమైన డిన్నర్లూ, బహుమానాల పేరిట వచ్చే నగలూ, ఆభరణాలూ. నా సంపద పేరుకోసాగింది.

"సరిగా అప్పుడే మైసూరులో కమలాకరం తారసపడ్డాడు. అతనితో రెండేళ్ళ కాంట్రాక్టు రాశాను అతని క్లబ్బులో డాన్సర్ గా. నేను ఈ వృత్తిలో ఉన్నా నేను ఉన్నత విద్య చదివినదాన్నని కొంతమంది గౌరవించేవారు. కమలాకరంగూడ వాళ్ళలో ఒకడు.

"నేనంటే అతడికి రోజురోజుకీ మోజు పెరిగిపోయింది. చివరకు పెళ్ళాడమని ప్రపోజ్ చేశాడు. నేను చెప్పిన షరతులన్నిటికీ ఒప్పుకున్నాడు."

"ఏమిటి నీ షరతులు?"

"పది లక్షలరూపాయలు నా పేర బ్యాంక్‌లో వేసేటట్లు మొదటిది. కాని అతడు ఇరవై లక్షలు వేశాడు అప్పటికప్పుడే. అతగాడు వయసు మళ్ళినవాడు. హార్ట్ ఎటాక్ వచ్చి హఠాత్తుగా హరీ అంటే నా గతేమిటని అడిగేను?"

"పెళ్ళి మాటలప్పుడే చావులూ, హఠాన్మరణాల గురించి ప్రస్తావనా?"

"నా మాటలకు అడ్డంరాకు! చెప్పేది విను ముందు! దానికి అతడు తన వీలునామాలో నాకు సగం ఆస్తిని అతని తదనంతరం నాకు వచ్చేట్లు రాశాడు. అన్నట్లు చెప్పటం మరిచాను. అతడు బ్యాంక్‌లో వేసిన ఇరవై లక్షలూ అతని తదనంతరమే తీసుకోవాల్సి ఉంది."

"సరిసరి! అంటే కమలాకరం చనిపోయిన తర్వాతనే నీకు ఆ ఆస్తి సంక్రమిస్తుందంటావ్!"

"కరెక్ట్! ఆ ఆస్తికోసమే అది నా చేతికి ఎప్పుడొస్తుందా అని ఆతృతపడుతున్నాను."

"అంటే కమలాకరం ఎప్పుడు చనిపోతాడా అని కాచుకుని ఉన్నావా?"

సుజాత అతనికి దగ్గరగా జరిగింది. అతని నోటిదగ్గరగా తన పెదిమలుంచి అంది:

"నిరంజన్! నేనంటే నీకు ప్రేమ ఉందా? నేను ఎల్లప్పుడూ నీ దాన్ని కావాలని ఉందా?"

"ఏమిటి డార్లింగ్ నువ్వనేది?"

"అందం, ఐశ్వర్యం గల భార్య కావాలంటే!" ఆమె మరీ దగ్గరగా అయింది. "కమలాకరానికి టిక్కెట్టిచ్చేసెయ్. అతడి పర్సనల్ డాక్టరువుగదా నీవు!"

నిరంజనరావు బిత్తరపోయాడు. బిక్క బిక్కమంటూనే మరో సిగరెట్ వెలిగించాడు.

అతడి చేతిలోని ప్యాకెట్ అందుకుని తనే సిగరెట్ వెలిగించుకుంది సుజాత.

"ఏం డార్లింగ్! ఒక్కసారే మ్రాన్పడిపోయావ్! అన్నట్లు రాజ్యలక్ష్మి నాకు తెలుసు. ఆమె ఒకానొక క్లబ్‌లో డాన్సర్! ఆమెకు 'మార్జువానా' అలవాటుంది. క్లబ్‌లో డాన్స్ అయిపోయాక ఆ రోజు పెద్ద మోతాదులో వేసుకుని పడుకుంది. డోస్ ఎక్కువై ఆమె చనిపోయింది. ఆమెను ఎలా 'డిస్పోజ్' చెయ్యాలా అని ఆలోచిస్తూన్న నా భర్తకు నిన్ను ట్రాప్ చెయ్యడానికి ఆ శవాన్ని నీ ఇంట్లోకి చేరవేయించాడు.

"ఒకవేళ అతను చెప్పిన షరతులకు లోబడి నువ్వు ఫ్యామిలీ డాక్టర్‌గా ఉండటానికి ఒప్పుకోలేకపోతే నిన్ను ఇలాంటి కేసుల్లో ఇరికించడమో, లేక స్వర్గానికి టిక్కెట్టు ఇప్పించటమో జరుగుతుంది.

"ఇప్పుడు నువ్వూ ఈ వలయంలోకి వచ్చేశావ్! నీ జీవితాంతం కమలాకరానికి బానిసగా ఉండాల్సిందే. లేదా అతడి చేతిలో మరణించటమో జరుగుతుంది. కనుక నీకు ఇప్పుడు ఇదే మంచి అవకాశం! నీ చేతిలో అతడు చావటమో, లేదా అతడిచేతిలో నీవు చావటమో! నే చెప్పేది అర్థమయిందా?"

"అయింది! కమలాకరం తన ముఠాలో ఎదురుతిరిగిన వాళ్ళని ఎలా డిస్పాచ్ చేస్తాడంటావ్?"

"అతనిమీద అనుమానం రాకుండా చేస్తాడు. మేడమీదనుంచి నువ్వు క్రిందపడతావ్ కాలుజారి! లేదా సరిగ్గా రైలు వస్తున్నప్పుడే ప్లాట్‌ఫారంమీద నిల్చున్న నీవు పట్టాలమీద పడిపోతావ్! లేదా రోడ్డుమీద పోతూన్నప్పుడు ఏదో లారీవచ్చి నీ మీదుగా పోతుంది. అప్పులతో జీవితంమీద విరక్తి కలిగి ఎండ్రిన్ త్రాగి

నట్టుగా ఉత్తరం నీ జేబులో ఉండంగా నీవు పరలోక యాత్ర చేస్తావు! ఇలాంటివే ఎన్నో!"

"అబ్బ! నాకు ఇంకా భూమ్మీద నూకలుండడంవల్ల నే కమలాకరాన్ని ఎదిరించలేను."

"అదిసరే! జరిగిపోయినదాన్ని గురించి అనుకుని ప్రయోజనం ఏమిటి? రాబోయే ఆపదగురించి ఆలోచించు!" ఆమె అతని మెడచుట్టూ చేతులువేసి తనదగ్గరకు లాక్కుంటూ అంది మళ్ళీ. "మనం త్వరపడాలి డార్లింగ్. ఏదో ఒక నిర్ణయానికి రావాలి? అతడు మనల్ని వదలిపోయిన మరుక్షణం మనిద్దరం పెళ్ళాడుదాం! బోలెడంత ఐశ్వర్యం మనది! నా అందం నీది! నీ బలం నాది! నీలాంటి, భార్యమాటకు ఎదురాడని భర్త అంటే నాకు భలే ఇష్టం!"

"ఈ పని రాఘవ్ చేత చేయించవచ్చు కదా?"

"అతడో బ్రూట్. అతడికి కావాల్సింది డబ్బుగాని, నేనుకాదు. అందుకే నీవంటె నా కిష్టం!"

అతడు మౌనంగా ఉండిపోయాడు. సిగరెట్ పీకను యాష్ ట్రేలో పడేసి ఆమెవైపుగా జరిగాడు. అతడి చేతుల్లో ఆమె మైనపు ముద్దలా అయిపోయింది.

11

"అయ్యగారు మిమ్మల్ని పిలుచుకురమ్మన్నారు సార్!" అన్నాడు డ్రైవరు.

మెడికల్ ఛెస్ట్ తీసుకుని డాక్టర్ నిరంజనరావు కారులో కూర్చున్నాడు.

కమలాకరం ఆఫీసులో తనగదిలో కూర్చుని ఏవో ఎక్కౌంట్ బుక్స్ చూస్తున్నాడు.

ఎయిర్ కండిషన్డ్ గదిలో చల్లగా ప్రాణానికి హాయిగా

ఉంది. దైవం అనుకూలిస్తే ఈ చల్లని వాతావరణానికి తనూ త్వరలోనే అధిపతి కాగలడు అనుకుంటూ కమలాకరం వంక అసూయగా చూశాడు.

"మీరు రేపటిదాకా రారని అన్నారు ఇంట్లో. అందుకే డైలీ చెకప్ కి రాలేదు!"

"అఫ్ కోర్స్! నేను రేపే రావాల్సింది. వెళ్ళిన పని త్వరలో అయిపోయింది. అందుకని వచ్చేశాను ఇవాళే! నాకేం కంప్లయింట్ లేదులెండి! మీరిచ్చిన క్యాప్సుల్స్ వాడాను! అవిచాలా బాగా పనిచేసినయ్!"

"థాంక్యూ సార్!"

"పోతే ఇప్పుడు మిమ్మల్ని ఎందుకు పిలిచానో తెలుసా? ఈ నెలాఖరులో నేను ఫారిన్ వెడుతున్నాను. షుమారు ఈ ట్రిప్ నాలుగయిదు వారాలు పట్టవచ్చు!"

"ఏ దేశం?"

"ఫ్రాన్స్! విమాన ప్రయాణంలోను, అక్కడి సరికొత్త వాతావరణంలోను నాలో బ్లడ్ ప్రెషర్ హెచ్చవచ్చు. లేదా గుండెపోటు రావచ్చు. కనుక నా ఫామిలీ డాక్టర్ వెంట ఉండాలని అనుకుంటున్నాను. అందుకని నీవూ నా వెంట రావాల్సి ఉంటుంది!"

"మరి ఇక్కడ నా ప్రాక్టీసు!"

"మిస్టర్ నిరంజనరావ్! ఒక్కొక్కసారి నీవు చిన్నపిల్లవాడికన్నా ఎక్కువ తెలివితక్కువగా మాట్లాడుతావ్! కమలాకరాన్ని ట్రీట్ చేసే డాక్టరువు నీవు. నీకు డబ్బుకు లోటేముంది ఇక్కడ? నీ ప్రాక్టీసుమీద నీ జీవితంలో ఇంత సంపాదించలేవు!"

"ఒకవేళ నేను మీతో రావటానికి ఇష్టపడకపోతే?"

"ఇక్కడ అంతా నా ఇష్టప్రకారమే పనులు జరగాలి! నీ ఇష్టాయిష్టాలతో ప్రమేయంలేదు. నీవు ఉద్యోగివి

నేను యజమానిని! ఆ విషయం మరిచిపోకు డాక్టర్!"

"ఆల్ రైట్ సర్! మీ ఆజ్ఞలు జారీ చెయ్యండి. నేను శిరసావహిస్తాను," షేక్స్పియర్ ముఖం పెట్టి నిదానంగా అన్నాడు నిరంజనరావు.

"అలా దారికిరా! నీవు ఫారిన్‌లో నా వెంట ఉన్నందుకు అదనంగా మరో పదివేలరూపాయలు ఫీజుక్రింద ఇస్తాను. నీ ప్రయాణ ఖర్చులు ఇతర సదుపాయాలూ అన్నీ నేనే భరిస్తాను."

"సరేసర్!" తలవూపాడు ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా.

12

డాక్టర్ నిరంజన్‌రావు రివాల్వర్‌ని లోడ్ చేసి, దానికి సైలెన్సర్‌ని బిగించి, కసిగా పరుపువేపుగా కాల్చాడు. చడీచప్పుడు లేకుండా బుల్లెట్ వెళ్ళి పరుపులో దూరింది.

సరిగ్గా అదే సమయానికి దబదబ తలుపు బాదిన చప్పుడయింది. కంగారుగా రివాల్వర్‌ని కోటుజేబులో వేసుకున్నాడు.

"అబ్బ! ఎంతసేపు తలుపు తట్టేది! ఇంట్లో ఎవతెనన్నా తెచ్చిపెట్టుకున్నావా ఏం?" అంటూ సుజాత సుడిగాలిలా లోపలకువచ్చి పడింది.

"ఓ నువ్వా? ఎవరో అనుకుని గాభరాపడ్డాను!"

"రెండు రోజుల్నుంచి ఎక్కడా మనిషిజాడేలేదు! ఏమయిపోయావు డార్లింగ్!"

"నీవు నాకప్పగించిన పని నెరవేర్చటానికి తగిన సన్నాహాల్లో మునిగిపోయాను!"

"నిజంగా?" అంటూ ఆమె సంతోషంతో అతడ్ని కౌగిలించుకుని ముద్దుల వర్షం కురిపించింది. నిరంజనరావు

ఆనందానికి అవధుల్లేవు. కోటు జేబులోంచి రివాల్వరు తీసి చూపించాడు.

"ఇల్లు తాళం వేసిరా! ఈ ఆనందాన్ని బయట ఎక్కడన్నా ఎంజాయ్ చేద్దాం!" అంది ఆమె.

"కమలాకరం ఊళ్ళో లేడా?"

"ఉంటే నేనిలా వస్తానా?"

"ఎలాగైనా నీవు రొమాంటిక్ లేడీవికదా!" అంటూ రివాల్వరుని జాగ్రత్తగా పదిలపరచి, ఇల్లు తాళం వేసి, కారులో సుజాతతో బయలుదేరాడు నిరంజనరావు.

హోటల్ ఇంపీరియల్ లో రూమ్ బుక్ చేసుకున్నారు.

"డార్లింగ్!" అంటూ జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ సుజాత అతడ్ని తన మీదకు లాక్కుంది.

టైమ్ రాత్రి పదకొండు గంటలవుతుంది.

"నిన్ను ఇవాళ ప్రత్యేకం పని గట్టుకుని ఎందుకు తెచ్చానో తెలుసా?"

"దేనికి?"

"కమలాకరాన్ని ఎక్కడ గురిపెట్టి లెక్కించాలో చెప్పటానికి. జాగ్రత్తగా విను. ప్రతి శనివారం కమలాకరం చిన్న సూట్ కేస్ తో హోటల్ నవయుగలో మొదటి అంతస్తు మొదటి గది, గది నెంబరు 101లోకి వెళతాడు సరిగ్గా ఏడుగంటలకు. ఆ తర్వాత కరెక్ట్ గా అయిదు నిముషాలకు అదే రకం సూట్ కేసులో మరో వ్యక్తి అదే రూమ్ లోకి వెళతాడు. ఆ వ్యక్తి ఏదో నైట్ క్లబ్ కి మేనేజర్ అయివుంటాడు.

"అతడి చేతిలోని సూట్ కేసులో ఆ వారంలో ఎల్. యస్. డి, మార్జువానా మొదలైనవి అమ్మిన తాలూకు కలెక్షన్ ఉంటుంది. కమలాకరం దగ్గరవున్న సూట్ కేసులో కొత్త ప్యాకెట్లలో మరో వారానికి సరిపడే

'సరుకు' ఉంటుంది. ఇద్దరూ తమతమ బ్రీఫ్ కేసుల్ని మార్చుకుంటారు. కమలాకరం త్వరత్వరగా క్యాష్ లెక్క చూసుకుని "యస్! ఓకే!" అంటాడు! ఆ తర్వాత ముందు కమలాకరం వెళ్ళిపోతాడు. మరో అయిదు నిముషాలకు ఆ వచ్చిన మేనేజర్ వెళ్ళిపోతాడు."

"ఆ రూమ్ వీళ్ళకోసమే ఖాళీగా ఎలా వుంటుంది. మరెవరన్నా అందులో బసచేస్తే?"

"ఆ అవకాశంలేదు. ఎందుకంటే ఆ రూమ్‌కి నెలసరి అద్దె కట్టేస్తాడు కమలాకరం!"

"అయితే వారానికి ఒక రోజే వెడతాడా? మరి మిగతా రోజులు ఎక్కడకు వెడతాడు?"

"అలానే ఒక్కో రోజు ఒక్కో ఊళ్ళో ఒక హోటల్‌లో ఆ ఊరి క్లబ్ మేనేజర్ కలుసుకుంటాడు."

"అందుకా ఎప్పుడూ క్యాంప్‌లమీద తిరుగుతూంటాడు."

"అవును. నీవు కూడా శనివారంనాడు సరిగ్గా ఆరు గంటల యాభై అయిదు నిముషాలకు హోటల్ నవయుగకు వెళ్ళాలి. కమలాకరం తన రూమ్‌కి సరిగ్గా ఏడుగంటలకు వస్తాడు. అతడి వెనకాలే నీవూ వెళ్ళి నీ డ్యూటీ అయిదు నిముషాల్లో ముగించుకు వచ్చేయాలి. ఆ తర్వాత క్లబ్ మేనేజర్ వస్తాడు. అప్పటికి నీ పని పూర్తి చేసుకుని బయటకు వచ్చేయాలి. తెలిసిందా?"

"తెలిసింది!"

"మేము సరిగ్గా అదే టయిమ్‌కు హోటల్ మేనేజర్‌కి ఫోన్ చేస్తాము. 101 నెం. గదిలో హత్య జరిగిందని, వెంటనే క్లబ్ మేనేజర్ని అరెస్టు చేస్తారు."

"అంతేకాదు! ఈ హోటల్లోనే నీవు చిన్న విందు ఇవ్వాలి ఆరోజు ఏడుగంటలకు. నలుగురైదుగురు గెస్ట్‌లు కూడా ఉంటారు. ఫోన్‌లో నాతో మాట్లాడినట్లు

నటించు. ఆ తర్వాత నేను ఏదో సీరియస్ కేస్ ఎటెండ్ అవుతున్నట్టు, మరో అయిదు నిముషాల్లో వస్తానని అతిథు లకు చెప్పు. ఆ తర్వాత నేను అక్కడ ప్రత్యక్షమవు తాను. అంటే నేను డిస్పెన్సరీలో ఉన్నట్టు ఎలిబీ ఉంటుంది.''

''గుడ్ అయిడియా! ఏమో అనుకున్నాను నీ బుర్ర కూడ పని చేస్తోందే!''

''నీ స్నేహం మరి!'' అన్నాడు నిరంజనరావు హుషా రుగా.

''స్నేహం సంగతేమోగాని ఒకటిమాత్రం గుర్తుం చుకో. ఒక వేళ నీ తలరాత బాగోక నీవు పట్టుబడినా లేక ఫెయిల్ అయినా నా పేరు బయటికి రాకూడదు! నీవే కసాయికారం పీడ వదిలించుకోవడానికి నిర్ణయించు కుని చేసినట్టు చెప్పాలి!''

''డార్లింగ్! నా ప్రాణంపోయినా నీ పేరు బయట పెడతానా?''

సుజాత మత్తుగా అతన్ని తన చేతుల్తో పెనవేసింది.

13

రోజూలాగే తెల్లవారింది. నిరంజనరావు నిద్రలేచి దేవుని పటానికి దణ్ణం పెట్టాడు. స్నానం చేసి డ్రెస్ వేసుకుంటూండగా కాలింగ్ బెల్ మ్రోగింది.

తలుపు తీయంగానే ఎదురుగా ఇన్స్పెక్టర్ రాజా రావు కనుపించాడు.

''గుడ్ మార్నింగ్ డాక్టర్!'' అన్నాడు నవ్వుతూ.

''గుడ్ మార్నింగ్ ఇన్స్పెక్టర్! ప్లీజ్ గెట్ ఇన్!'' అంటూ సోఫా చూపించాడు.

''విశేషాలేమైనా ఉన్నాయా సార్! రాజ్యలక్ష్మి కేసు క్లోజ్ అయిందా?''

"ఇంకా లేదు. ఆఫ్ కోర్స్ ఆమె ఆత్మహత్య చేసుకున్న దన్నమాట నిర్వివాదాంశం! కాని ఆమె మీ ఇంట్లోకి ఎలా వచ్చిందన్నది తేలాలి గదా? అంతవరకూ కేసు క్లోజ్ చెయ్యటానికి వీల్లేదు."

"అవునవును!"

"ఆ రాత్రి మీరు ముగ్గురూ అంటే మీరూ, రాఘవరావూ, సుజాత హోటల్ మెజిస్టిక్‌లో ఉన్నామని చెప్పారు కదూ?"

"అవును!"

"సుజాతకూ రాజ్యలక్ష్మికీ పరిచయం ఉన్నట్టు మాకు దాఖలాలు దొరికినయ్!"

"అలాగా! ఆ విషయం నాతో ఆమె ఎన్నడూ అనలేదే?"

"సుజాత మీ పేషెంటా?"

"కమలాకరం, అతని భార్య సుజాత ఇద్దరూ నా పేషెంట్లే. నేను వాళ్ళ ఫామిలీ డాక్టర్ని!"

"ఆమె చాలా అందగత్తె కదూ? ఆమె అంత ముసలి మొగుడ్ని ఎందుకు ఎన్నుకుందో!"

"తెలీదు ఇన్స్పెక్టర్! బహుశా అతని ధనం చూసి చేసుకుని ఉండవచ్చు!"

"అవునా? పోతే ఆమె మీ పేషెంటేనా? లేక ఇంకా సన్నిహితత్వం ఉందా?" ఆ ప్రశ్న అడుగుతూ అతని కళ్ళలోకి సూటిగా చూశాడు ఇన్స్పెక్టర్.

ఇన్స్పెక్టర్ ఇలాంటి ప్రశ్న అడుగుతాడని నిరంజనరావు కలలో గూడ ఊహించలేదు.

"అంటే ఆమెకూ నాకు అక్రమసంబంధం ఉందనా మీరు అడగడం!" కొంచెం తడబడ్డాడు నిరంజనరావు.

"ఆఫ్ కోర్స్! అంతే! కాని ఈ ప్రశ్న మిమ్మల్ని అడగ

డానికి నాకే బాధగా ఉంది."

"నిజమే ఇన్స్పెక్టర్! ఎవరికైనా అలా అనుమానించ టానికి అవకాశం ఉంది. కాని నాకూ జీవితంలో కొన్ని ప్రిన్సిపల్స్ ఉన్నయ్. ఆమెకూ నాకూ ఎలాంటి అక్రమ సంబంధంలేదు. పైగా కమలాకరం తన భార్యను వేయి కళ్ళతో కనిపెట్టుకుని ఉంటాడు. ఆమె మీద మోహంతో ఒక సంపన్నుడయిన పేషెంట్ని వదులుకోలేను."

"మిమ్మల్ని అలా ఎందుకడిగానంటే ఒకవేళ సుజాత మీ ఇంటికి తరచుగా వస్తూ ఉండివుంటే మీ ఇంటితాళం డూప్లికేట్ ఆమె సంపాదించే అవకాశం ఉంది. దాని సాయంతోనే రాజ్యలక్ష్మి మీ ఇంట్లో ప్రవేశపెట్టబడి ఉండచ్చు."

"అలాంటిదేమీ జరుగలేదు ఇన్స్పెక్టర్."

"కమలాకరంకి మీరు ఎన్నాళ్ళనుంచి ట్రీట్మెంట్ ఇస్తున్నారు?"

"నాలుగు నెలలనుంచి!"

"అంతకుముందు వారితో పరిచయం లేదా?"

"లేదు!"

"మిమ్మల్ని కమలాకరానికి ఇంట్రడ్యూస్ చేసింది ఎవరు?"

"లాయర్ రాఘవరావు. అతడ్ని చిన్నప్పట్నుంచీ ఎరుగుదును. మా ఫాదర్, అతని ఫాదర్ గూడ చాలా డియరెస్ట్ ఫ్రెండ్స్!"

"థాంక్యూ డాక్టర్! మీ టైమ్ చాలా తీసుకున్నా న్నేమో! వస్తాను! సీ యూ ఎగైన్!" అంటూ ఇన్స్పెక్టర్ రాజారావు లేచాడు.

నిరంజనరావుతో కరచాలనం చేసి, బయటపవెళ్ళి జీప్ ఎక్కాడు ఇన్స్పెక్టర్ రాజారావు.

నిరంజనరావు విజయోత్సాహంతో సోఫాలో వెనక్కి కూలబడ్డాడు. ఎంతో నేర్పుగా పోలీసు ఇన్స్పెక్టర్ని బోల్తా కొట్టించాడు. తనలో హంతకుడికి కావాల్సిన నేర్పు ఇప్పుడిప్పుడే పెరుగుతుంటోంది, అని తననితనే అభినందించుకున్నాడు.

11

డిస్పెన్సరీలో వెయిట్ చేస్తున్న పేషెంట్లను డిస్పోజ్ చేసి పన్నెండు గంటలకే ఇంట్లోంచి బయలుదేరాడు నిరంజనరావు. తనకు తెలిసిన డాక్టర్లను ఒకరిద్దరిని పరామర్శించాడు. ఆ తర్వాత రాఘవరావు కారు అడిగి తీసుకున్నాడు.

"అన్నట్టు చెప్పటం మరిచిపోయాను. ఇవాళ సాయంకాలం ఏడుగంటలకు సుజాత పార్టీ ఇస్తున్నది ఇంపీరియల్‌లో. నాకు ఫోన్ చేసి నిన్నూ రమ్మని చెప్పమంది. నేనే వద్దామనుకున్నాను. నీవే వచ్చావ్!"

"ఓ.కే! ఒకటి రెండు అర్జెంటు కేసుల్ని చూసుకుని సరిగ్గా టైమ్‌కి వస్తాను నేను!" అంటూ కారేసుకుని బయలుదేరాడు.

అతడి కోటు జేబులో రివాల్వరు ఉంది. చేతులకు ప్లాస్టిక్ గ్లోవ్స్ ఉన్నాయ్.

రియర్వ్యూ మిర్రర్‌లో తనను ఎవరన్నా ఫాలో అవుతున్నారేమో అని చాలాసేపు పరిశీలించాడు. కాని ఎవరూ అనుమానించతగ్గ వాళ్ళు కనుపించలేదు.

నవయుగ హోటల్‌కు ఫర్లాంగు దూరంలో కారు ఆపాడు. లాక్ చేసి ఫుట్‌పాత్ మీద నడుచుకుంటూ వెళ్ళి నవయుగ హోటల్‌కి ఎదురుగా వున్న మరో చిన్న హోటల్లోకి దూరాడు. ఒక మూలగా టేబుల్ ముందు కూర్చుని రోడ్డుమీదకే దృష్టినిలిపాడు. వెయిటర్‌కి ఏవో

ఆర్డర్ ఇచ్చి వాటిని ఆరగించాడు.

సరిగా ఏడుగంటలకు కమలాకరం తనే కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చాడు. కారుదిగి లాక్ చేసి నవయుగలోకి వెళ్ళాడు.

నిరంజనరావు బిల్లు చెల్లించి తనూ నవయుగలోకి నడిచాడు,

కమలాకరం మేడమెట్లెక్కి 101 నెం. గదిలోకి వెళ్ళాడు. అతడు లోపలకు వెళ్ళి తనవెనుకే తలుపు వేసుకున్నాడు.

నిరంజనరావు గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నయ్. కాని ఎంతో నిదానస్తుడిలా మెట్లెక్కాడు. 101 నెం. గదిముందు నిలబడి ఒకసారి వెనక్కు చూశాడు. మేడ మెట్లు మలుపుగా ఉండటంవలన ఎవరూ తనని గమనించే అవకాశంలేదు.

ఒకచేయి కోటు జేబులోనికి పోనిచ్చి మరో చెయ్యి తలుపు నాబ్ మీద వేసి తలుపు తెరిచాడు. లోపలకు అడుగుపెడ్తూనే తలుపుని తన వెనకాల మూసేశాడు.

మెరుపులా కోటు జేబులోని చెయ్యి బయటకు వచ్చింది. ఆ చేతిలో సైలెన్సర్ అమర్చబడిన రివాల్వర్ ఉంది.

ఎదురుగా కుర్చీలో కమలాకరం తనవంకే చూస్తూ రాయిలా కూర్చుని ఉన్నాడు. అతడిచేయి సోఫా ప్రక్కన వాలింది.

నిరంజనరావ్ చేతిలో రివాల్వర్ ఎవరో లాగేసినట్టుగా అయింది. క్షణంలో అది గాలిలో లేచివెళ్ళి పైకప్పుకి అతుక్కుంది.

కమలాకరం లేచివచ్చి అతడి చేయిని మెలితిప్పాడు. ఎదురుగా మరో సోఫాలో కూలదోశాడు.

"వెల్‌కమ్ డాక్టర్! మనం ఇలా కలుసుకోవటం నాకు చాలా ఆనందంగా ఉంది! ఎందుకంటే మనుష్యుల్ని గురించి నేను వేసే అంచనాలు ఎన్నడూ తప్పవు కావు!" అంటూ సోఫా ప్రక్కగావున్న బటన్ నొక్కాడు.

పైన సీలింగ్‌లో మాగ్నెట్‌కి అతుక్కుపోయిన రివాల్వరు ఊడి క్రిందపడింది.

కమలాకరం దాన్ని దొరకపుచ్చుకున్నాడు.

"ఇడియట్! తిన్న ఇంటి వాసాలనే లెక్కపెట్టే రోగ్! ఇప్పుడు చెప్పు! నీకేం శిక్ష విధించాలో నీవే చెప్పు! ఇప్పటికైనా నా తడాఖా తెలిసిందా?"

"కమలాకరం! ఆవేశపడకండి! మీకు గుండె నొప్పి రావచ్చు మళ్ళీ!"

"నాకు కాదురా! నీకు వస్తుంది గుండెపోటు."

అంతలోనే డోర్ నాబ్ మళ్ళీ తిరిగింది. అది చూసి కమలాకరం సైలెన్సర్ తీసి సోఫాలోని దిండు క్రింద దాచేశాడు.

తలుపు తెరుచుకుని ఆజానుబాహుడైన ఒక వ్యక్తి లోపలకు వచ్చాడు. అతడి చేతిలో నల్లటి ఆటోమేటిక్ పిస్టల్ మెరుస్తోంది.

నిరంజనరావు అతడి చేతిలోని పిస్టల్ గూడ పై కప్పున ఉన్న మాగ్నెట్‌కి అతుక్కుంటుందేమోనని ఆశగా చూశాడు. కాని అదేం జరగలేదు.

కమలాకరాన్ని చూస్తూ "ఎక్స్క్యూజ్ మి సార్! ఇక్కడ అంతా సవ్యంగానే ఉందని ఆశిస్తాను!" అన్నాడు.

"ఏమిటి సంగతి నరేంద్రసింగ్! ముందు ఆ పిస్టల్‌ని జేబులో పెట్టుకో. వాటిని చూస్తేనే నాకు గుండె దడ వస్తుంది. అసలే నేను హృద్రోగిని!"

"అలా గేసార్!" అంటూ అతడు నిరంజనరావు వైపు అనుమానంగా చూశాడు.

"ఇతడు నా ఫ్యామిలీ డాక్టర్! నేనే పిలిపించాను!"

"థాంక్యూసార్! ఇంతకు మునుపు ఒక నిముషం క్రిందటే ఎవరో అజ్ఞాత వ్యక్తి మాకు ఫోన్ చేసి 101 నెం. గదిలో పిస్తోలు ప్రేలిన చప్పుడు తమకు వినిపించిందనీ, కనుక ఏదో హత్య జరిగి ఉండాలనీ చెప్పాడు. వెంటనే మేం ద్వారాలన్నీ మూసేశాం. లిఫ్ట్స్ని సయితం ఆపుచేశాం. నిజంగా హత్యగనుక జరిగితే హంతకుడు బయిటకు పోలేడు. బోనులో పడ్డ ఎలకలా మాకు దొరికి పోతాడు."

"మా స్టాఫ్ని చూస్తుంటే నాకు అందుకే చాలా ముచ్చట వేస్తుంది. ప్రాంప్ట్ సర్వీసు. ప్రతి విషయం లోనూ చాలా అప్రమత్తతతో ఉంటారు! థాంక్యూ మిస్టర్ సింగ్!" అన్నాడు కమలాకరం.

నరేంద్రసింగ్ సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు. అతడు మెట్లు దిగుతూండగానే అతడికి బ్రీఫ్ కేస్ తీసుకుని వస్తూ మేనేజర్ ఎదురుపడ్డాడు.

డోర్ తెరుచుకుని లోపలకు వచ్చిన మేనేజర్ గదిలో కమలాకరంతోబాటు మరో వ్యక్తిని చూసి ఆగి పోయాడు.

"మే ఐ కమిన్ సర్?" అంటూ వినయంగా అడిగాడు.

"కమిన్ మిస్టర్ డేవిడ్!" అంటూ తన సీటు వెనకాల చాటుగా ఉంచిన బ్రీఫ్ కేస్ని తీసి అతగాడికిచ్చాడు.

ఆ బ్రీఫ్ కేస్ని అందుకుని తనుకెచ్చిన దాన్ని కమలాకరానికి ఇచ్చాడు.

"ఇవాళ్టికి లెక్క చూడకుండానే తీసుకుంటున్నాను. నాకు అవతల చాల అర్జంటు పనులున్నాయ్! అంతా కరక్టుగానే ఉందికదూ?"

"కరక్టుగానే ఉంది సార్!"

"ఆల్ రైట్! తర్వాత ఇక ఈ రూమ్ మార్చేస్తున్నాను. వచ్చేవారం మరోచోట కలుసుకుందాం. ఆ ప్లేస్ ఏదో నీకు మరోసారి తెలియజేస్తాను."

"అలాగే సార్!" అంటూ అతడు వెళ్ళిపోయాడు.

అతడు అటు వెళ్ళంగానే కమలాకరం సైలెన్సర్ ని చేతిలోకి తీసుకున్నాడు.

నిరంజనరావు ముఖంలో కత్తివాటు వేసినా నెత్తురు చుక్క లేదు. అతడి నోరు ఎండిపోయింది.

కమలాకరం ప్రక్కనే ఉన్న కప్ బోర్డులోంచి విస్కీ తీసి రెండు గ్లాసుల్లో పోశాడు.

"నీకు నోరు కూడ ఎండిపోయినట్టుంది! ఇంద! తీసుకో!" అన్నాడు.

నిరంజనరావు గ్లాసు ఆత్రంగా అందుకుని గడగడ ఒక్క గుటకలోనే త్రాగేశాడు.

"చదరంగంలో పావుని వాడినట్టుగా వాడుకున్నారు వాళ్ళు నిన్ను!"

"ఎవరు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నిన్ను పనికి ఎవరు పురికొల్పారో నీకే తెలీదా?"

అతను మాట్లాడలేదు.

"నా ప్రియమైన భార్య, ఆమె బాయ్ ఫ్రెండ్ రాఘవరావు కదూ నిన్ను పనికి పురమాయించింది?"

"రాఘవరావా?"

"అవును! వాడే! వాడు తెర వెనుక ఉండి సుజాతను ఎర చూపించి నిన్ను గోతిలోకి దింపాడు. దానికి ఎంత

ఐశ్వర్యం ఉన్నా చాలదు. గుడ్డలిప్పేటప్పుడని డాన్స్ చేసే బిచ్చని తీసుకువచ్చి కనకపు సింహాసనంమీద కూర్చో పెడితే దాని గుణం ఎక్కడికి పోతుంది?"

"రాఘవరావా సార్ ఇందులో విలన్?"

"అవును. అతడికి నాకు చాలాకాలంనుంచి పరిచయం ఉంది. అతడు నా లాయర్. కంపెనీలో అతడికీ చిన్న వాటావుంది. అతడే నిన్ను నాకు పరిచయం చేశాడు. నీకు సహాయం చేస్తున్నట్టుగా నాటకమాడి ఫ్యామిలీ డాక్టరుగా నియమించాడు. సుజాత తన అందంతో నిన్ను ఇంకా తెలివిమాలినవాడ్ని చేసేసింది."

గుడ్లప్పగించి వింటున్నాడు నిరంజనరావు.

"నన్ను హత్యచేసి వచ్చిన అనంతరం సుజాత నిన్ను అక్షుల ఆస్తితో వివాహమాడతానని చెప్పిందికదూ? ఆ మాటలు వినే నీవు నన్ను చంపటానికి తయారయావ్! డాక్టర్! నీ కన్న పసిపిల్లవాడు నయం! వాళ్ళ ప్లాన్ని తేలికగా అర్థం చేసుకునేవాడు.

"నీవు నా రూమ్‌లోకి ప్రవేశించి నన్ను షూట్ చేసే సమయానికే వాళ్లు తెలివిగా హోటల్ యజమానులకి ఫోన్ చేశారు. అంటే నీవు హత్య చేసిన మరుక్షణం హోటల్ వాళ్ళు నిన్ను బంధించేవాళ్ళు. నీకు వురిశిక్ష పడేది. తర్వాత రాఘవరావు సుజాత ఒకటైపోయేవాళ్లు."

నిరంజనరావు నమ్మలేనట్లుగా చూశాడు కమలాకరాన్ని.

"నేను ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్తగా ఉంటాను. నా గది తలుపుకి సరిగ్గా పైన సీలింగ్‌కి మూడు అడుగుల వ్యాసంగల రౌండ్ మాగ్నెట్ వుంది. నా సీట్ ప్రక్కనే బటన్ నొక్కితే మాగ్నెట్ 'ఆన్' అవుతుంది. ఆగంతకుడి చేతిలో గాని లేదా మరో భాగంలో

దాచుకున్న రివాల్వరు, కత్తిలాంటి వస్తువేదయినా వెళ్ళి దానికి అతుక్కుంటుంది. అందుకే నీ ప్లాన్ ఫలించ లేదు."

"సుజాత మిమ్మల్ని హత్య చెయ్యమనలేదు. ఆ పనికి నాకై నేనే పూనుకున్నాను." అన్నాడు నిరంజనరావు.

"ఈ ప్రపంచంలో నీ అంతటి ఇడియట్ ఇంకొకడు ఉండడు. వాళ్ళ నిజరూపాలు నీ కళ్ళతో నీవే చూద్దువు గాని, పద."

అంటూ అతడి చేతిని తన చంకలో ఇరికించుకుని బయటకు నడిచాడు కమలాకరం.

అతడి రెండో చేతిలో సైలెన్సర్ రెడీగా ఉంది. అది అందరికీ కనిపించకుండా దానిమీద తన కోటు కప్పాడు కమలాకరం.

15

కారు కమలాకరం ఇంటికి కొంచెం దూరంలో ఆగింది.

"దిగి నడిచి వెళ్దాం! కారుని చూసి వాళ్లు మనం వచ్చి నట్టు గుర్తించి జాగ్రత్తపడవచ్చు!" అన్నాడు కమలా కరం.

"మేమ్ సాబ్ ఆగయా?" కమలాకరం గుర్ఖాని అడి గాడు.

"ఆయా సైసాబ్!" అంటూ వాడు సలాం చేస్తూ చెప్పాడు.

"నేను లోపల ఉంటాను. కాని రాఘవరావు గాని, మేమ్‌సాబ్ గాని అడిగితే రాలేదని చెప్పు" ఉరిమాడు కమలాకరం.

"అలాగే సాబ్!" బిత్తరపోయాడు వాడు.

ఇద్దరూ వెళ్ళి డ్రాయింగ్ హాల్లో మెట్ల క్రిందుగా చీకటి కుయ్యారంలో రెండు కుర్చీలు లాక్కొని కూర్చున్నారు.

"ఊపిరిగూడ గట్టిగా పీల్చకు. వాళ్లు మనని పసిగట్టారో మనకి దొరక్కుండా పారిపోతారు."

నిరంజనరావు తలవూపాడు. అతడికి నోట్లో నాలుక ఉండచుట్టుకుపోయినట్టయింది. మాటే రావటంలేదు. మనసు రాయిలా మొద్దుబారిపోయింది. అంతా ఏదో కలలాగ వుంది అతడికి.

పావుగంట గడిచింది. డ్రాయింగ్ హాల్ ఎంట్రెన్స్ తలుపు తెరుచుకుని వగరుస్తూ చెమటలు కారుస్తూ రాఘవరావు, సుజాత లోపలకు వచ్చారు. సుజాత విసుగ్గా తన చేతిలోని హ్యాండ్ బ్యాగ్ ని సోఫాలోకి విసిరేసింది. విచారంగా కూలబడింది.

"ఏదో పొరబాటు జరిగివుండాలి!" అన్నాడు రాఘవరావు ఆలోచనగా.

"అవును. ఈ పాటికి ఇక్కడికి పోలీసులు వచ్చి ఉండాల్సింది. శవాలూ, పత్రికా విలేఖరులూ, ఫోటోగ్రాఫర్లతో ఇల్లు సందడిగా ఉంటుందనుకున్నాం!" సుజాత అంది.

"ఏంజరిగి ఉంటుందంటావ్! ఆ బుద్ధావతారం రివాల్వర్ ని పట్టుకోవడానికి భయపడి పారిపోయి ఉంటాడా? లేక ఎక్కడైనా తప్పటడుగు వేశాడా కొంపదీసి!" అన్నాడు.

"అలా పారిపోయి ఉండడు. వాడ్ని నా అందంతో మెడదాకా ఊబిలో ముంచాను. ఛస్తే నానుంచి దూరం కాలేడు."

"లేదా ఆ ముసలాడు వాడ్ని ఎలకని పట్టేసినట్టు

పట్టుకుని ఉంటాడు. ఎగ్జిక్యూషన్ డిపార్టుమెంటుకు ఫోన్ చేసి పిలిపించి వాడ్ని క్షమా చేయించి ఉంటాడు. లేకపోతే ఈ సరికి ఆయనన్నా రావాలికదా?'' రాఘవరావు కంగారుగా అన్నాడు.

''పోనీ పోనీ! పీడా విరగడ అవుతుంది! వాడు వచ్చినా నా పేరు బయటపెట్టడు! సరా!'' సుజాత అనునయంగా అంది.

''మన పేర్లు రాకుండా ఉంటే బ్రతికిపోయామన్న మాటే! లేకపోతే ముసలాడు మనల్నికూడా జైలెక్కిస్తాడు. వాడసలే పరమ కిరాతకుడు.''

''అసలు డాక్టర్ 101 నెం. గదికి వెళ్ళేసరికే కమలాకరం తనరహస్య ప్రదేశం అతడికెలా తెలిసిందా అని ఆశ్చర్యపోతాడు. అంతేకాదు. హోటల్ కి ఎవరు ఫోన్ చేశారో కూడా ఆరాతీస్తాడు.''

''నీవా విషయాల గురించి ఏమీ చెప్పద్దు. కమలాకరం నిన్ను ఏదడిగినా నాకేమీ తెలియదని చెప్పు!''

''ఇదేమన్నా కోర్టు అనుకున్నావా, నాకు ఏమీ తెలియదంటే కేసు కొట్టివేయటానికి! కమలాకరం మన చర్మం ఒలిపించి చెప్పులు కుట్టిస్తాడు. నాకెందుకో భయంగా ఉంది రాఘవా?''

''ఎందుకు భయం! నేనున్నానుగదా!'' అంటూ ఆమె దగ్గరగా జరిగి ఆమె నుదుటిమీద ముద్దుపెట్టుకున్నాడు.

నిరంజనరావు చేతులు బిగుసుకున్నయ్. పెదిమలు కొరుక్కున్నాడు.

''చస్తుంటే సంధిమంత్రాలా నీకూ ఇప్పుడే లవ్ కావాల్సి వచ్చిందా?'' అంటూ సుజాత రుసరుసలాడింది.

''కాస్త మొహం తుడుచుకుని కొంచెం నవ్వు పులుముకో నుపోన. కమలాకరం రాగానే కాస్త ప్రేమ

నటించు. లేకపోతే మనమీద అనుమాన పడగలడు,” రాఘవరావు చెప్పాడు.

అప్పటిదాకా ఓర్పుగా వింటున్న కమలాకరం లేచి నిలబడ్డాడు. అతడి కుడిచేయి పైకిలేచింది. ఆ తర్వాత ఏదో బుల్లెట్ గాలిలో దూసుకుపోయిన శబ్దం వినిపించింది. మళ్ళీ వెంటనే మరోటి.

సోఫాలో కూర్చుని కబుర్లు చెబుతున్న రాఘవరావూ, సుజాతా ఇద్దరూ అరుస్తూ నేలకు ఒరిగిపోయారు. వాళ్ళ శరీరాల్లోంచి నెత్తురు పారింది. సోఫాలో రెండుచోట్ల నెత్తురు మడుగు అయింది.

కమలాకరం లేచి వాళ్ళదగ్గరకు వచ్చాడు.

“డాంగ్ రాస్కెల్స్! వీళ్ళని నమ్మినదెవరు?” అంటూ రాఘవరావు కణతకు రివాల్వర్ని నొక్కిపెట్టి మరో షాట్ పేల్చాడు. ఆ తర్వాత సుజాత కణతదగ్గర మరో షాట్.

నిరంజనరావు ఆ రెండు శవాల్నిచూసి బెంబేలుపడి పోయాడు.

అసలు కమలాకరం ఆ స్థితిలో ఉండాల్సిన వాడని అనుకున్నాడు. కాని విధి మరోలా నిర్ణయించింది.

“కదలకుండా అక్కడే కూర్చో డాక్టర్! మరో క్షణంలో నా అనుచరులువచ్చి వీటిని క్లీన్ చేసేస్తారు, ఒకచిన్న ట్రేస్ కూడ దొరక్కుండా! అసలు నేనిప్పుడు ఊళ్ళో లేనని రుజువు చేసుకుంటాను.

“ఇకపోతే వీటిని ఎలా డిస్పోజ్ చేస్తానంటావా? రేపుదయం ముగ్గురు వ్యక్తులు సముద్రంలో చేపలు పట్టాలని బోటులో వెళతారు. బోటు తిరగబడి పోతుంది. ఆ ముగ్గురూ సముద్రంలో పడిపోతారు. వారి ఆచూకీ అధికారులకు దొరికే లోపల సముద్రంలోని జలచరాలు

ఆశవాళ్ని తినేస్తయి. ఆ స్త్రీపంజరాల్ని ఎవరూ గుర్తించ లేరు!"

"ఆ మూసిన వ్యక్తి ఎవరు?" నిరంజనరావు అనుమానంగా అడిగాడు.

కమలాకరం వికటంగా నవ్వాడు. ఇన్నాళ్ళూ నిరంజనరావు అతడ్ని మంచివాడుగా ఉండగా చూశాడు. ఇప్పుడు అతనిలో కర్కశత్వాన్ని చూస్తున్నాడు.

"ఇంకెవరు? నీవే! నీవు చేసిన స్వామిద్రోహానికి అదే తగిన శిక్ష. బోటులోంచి తప్పించుకు వద్దామని ఆశపడుతున్నావేమో! అక్కడ తీరంలో నా అనుచరులు కాచుకుని కూర్చుంటారు!"

కమలాకరం టెలిఫోన్ వైపు నడిచాడు.

నిరంజనరావు నరాల్లో విద్యుత్తు ప్రవహించింది. అతడి మనస్సు తేలుకుట్టినట్టుగా బాధతో విలవిల్లాడి మేలుకుంది. నిరంజనరావు హైస్కూల్లో ఫుట్ బాల్ ఆటలో ప్రావీణ్యం సంపాదించాడు. గోల్ ఎక్కడో గురిచూసి బంతికీ గోల్ కీ మధ్యదూరం ఎంత ఉందో క్షణాల్లో అంచనావేసి బంతిని తన్నేవాడు.

వెంటనే తన శరీరాన్ని బంతిలా కుంచించుకున్నాడు. శరవేగంతో గాలిలో ఎగిరి పిస్టల్ నుంచి బయటకు దూసుకుపోయే బుల్లెట్ లా వెళ్ళి కమలాకరాన్ని ఢీకొన్నాడు.

కమలాకరం క్రిందపడిపోయాడు. అతడి చేతిలోని సైలెన్సర్ దూరంగా పడింది. నిరంజనరావు పరుగెత్తి కెళ్ళి దాన్ని చేతిలోకి తీసుకుని నిటారుగా నిలబడ్డాడు.

అయితే పడిపోయిన కమలాకరం మళ్ళీ లేవలేదు. అతడి కళ్ళు తననే చూస్తున్నయ్. కనురెప్పలు ఆడటం లేదు. కనుగ్రుడ్లు కదలాడటంలేదు.

దగ్గరకు వెళ్ళి అతడి చేయిపట్టుకుని నాడి పరీక్షించాడు డాక్టర్ నిరంజనరావ్! అప్పటికే కమలాకరం గుండె కొట్టుకోవటం మానివేసింది.

శవాన్ని దాటుకుని వెళ్ళి రిసీవరెత్తి డయల్ చేశాడు.

"హాలో ఇన్‌స్పెక్టర్ రాజారావ్ స్పీకింగ్!" వినిపించింది అవతలినుంచి.

16

డి. యస్. పి. ఆఫీసురూంలో నిరంజనరావు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. అతడి ముఖంలో ఏ రకమైన భావాలూ లేవు.

ఇన్‌స్పెక్టర్ రాజారావు తనకెదురుగావున్న డి.యస్. పికి కేసునంతా చెబుతున్నాడు.

"కమలాకరం చట్టవిరుద్ధమైన వ్యాపారం ఏదో చేస్తున్నాడని మాకు చాలా కాలంగా అనుమానంగా ఉంది సార్! అయితే అక్కడ అందుకు తగిన సాక్ష్యాలు ఏవీ మాకు లభించలేదు. డాక్టర్ నిరంజనరావు నాకు ఫోన్ చేశాడు. జరిగిన సంగతి స్పష్టంగా చెప్పాడు. అయితే అతడు చనిపోయినట్టు తెలిస్తే మిగతా నేరస్థులు, అతడి సహచరులు ఎక్కడికక్కడ మాయమవుతారు. అందుకని మేమంతా బిజినెస్ మెన్‌లా సూటూ బూట్లతో, బ్రీఫ్ కేసులు చేత్తో పుచ్చుకుని అతడి ఇంటికి వెళ్ళాం.

"కమలాకరానికి గుండెపోటు వచ్చిందనీ, డాక్టరు పర్యవేక్షణ క్రింద ఉన్నాడనీ అతడ్ని ఎవరూ కలవటానికి వీల్లేదని ప్రకటించాం. అతగాడికి ఒకరోజులో వచ్చిన ఫోన్ కాల్స్ అన్నిటినీ ట్రేస్ చేశాం. ప్రతి స్టేట్ హెడ్ క్వార్టర్స్‌కీ మెసేజీలు పంపాం.

"అదే ఆధారంగా అతడి వ్యాపార సంస్థలన్నిటి

మీదా ఒకరోజున అన్ని ప్రదేశాల్లోనూ రెయిడ్ జరిపారు. నేరసులు తగిన ఆధారాలతో దొరికారు. విదేశాలనుంచి పెద్ద ఎత్తున దిగుమతి అయిన మత్తుపదార్థాలను పోలీసు వారు హ్యాండ్ ఓవర్ చేసుకున్నారు! ఇదంతా డాక్టర్ నిరంజనరావు ఇచ్చిన సమాచారం వల్లనే వీలయింది."

"వెల్ డన్ డాక్టర్! మీ సహాయానికి ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో బహుమతి రావచ్చుగూడా!" అన్నాడు డి. యస్. పి. అతడికేసి చూస్తూ.

"అయితే నన్ను అరెస్ట్ చేయటంలేదా?"

"అరెస్టా? మీరు ఏ నేరం చేశారని?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

"కమలాకరాన్ని హత్యచేయటానికి ప్రయత్నించాను గదా?" ఆశ్చర్యంగా అన్నాడు నిరంజనరావు.

"ఓ! అదా! కానీ మీరు హత్యచేయలేదు! మీ కథను ప్రాసిక్యూషన్ వారు ఒప్పుకోకపోవచ్చు. పైగా మీ సహాయంవల్ల దేశానికి ద్రోహంచేస్తున్న నేరసుల ముఠాను అరెస్టు చేయటానికి వీలయింది! కనుక యూ ఆర్ నౌ ఫ్రీ, డాక్టర్!" అంటూ భుజంతట్టాడు డి. యస్. పి.

డాక్టర్ నిరంజనరావు హాయిగా వూపిరి పీల్చాడు.

—: ఐ పో యిం ది :—